

మచిలీపట్నం తీర ప్రాంత అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. రూ.6,500 కోట్లతో షిప్‌యార్డు నిర్మాణానికి గోవా షిప్‌యార్డు సంస్థ ముందుకొచ్చింది. ఇటీవల విశాఖలో జరిగిన సీఐఐ సదస్సుల్లో ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. సాధ్యమైనంత త్వరగా భూములు కేటాయిస్తే 2030 నాటికి నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. తద్వారా ఆరు వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొంది. షిప్‌యార్డు ఏర్పాటుతో అనుబంధ పరిశ్రమల స్థాపనకు అవకాశం కలగనుంది.

బందరు పడవ

మచిలీపట్నంలో రూ.6,500 కోట్లతో షిప్‌యార్డు నిర్మాణానికి ముందుకొచ్చిన గోవా సంస్థ

- విశాఖ సీఐఐ సదస్సులో కుదిరిన ఒప్పందం
- భూమి కేటాయిస్తే 2030 నాటికి నిర్మాణం పూర్తి చేస్తామని హామీ
- ఆరు వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- షిప్‌యార్డు అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో గోవా తరహాలో షిప్‌యార్డు నిర్మాణానికి రంగం సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ షిప్‌యార్డును గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ ద్వారా నిర్మాణం చేసేందుకు విశాఖపట్నంలో జరిగిన పారిశ్రామిక సదస్సులో ఒప్పందం కుదిరింది. ఏపీ మారీటైమ్ బోర్డు, గోవా షిప్ యార్డు సంయుక్తంగా నిర్మించేందుకు ముందుకు వచ్చింది. ఈ షిప్‌యార్డు నిర్మాణంతో ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందనుందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు.

రూ.6,500 కోట్ల పెట్టుబడి.. 6 వేల మందికిపైగా ఉద్యోగాలు!

మచిలీపట్నంలో షిప్ యార్డు ఏర్పాటుకు భూమిని కేటాయిస్తే 2030 నాటికి నిర్మాణం పూర్తి చేస్తామని గోవా షిప్ యార్డు ప్రతినిధులు ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందంలో స్పష్టం చేశారు. సుమారు మిగతా 6లో..

ఇప్పటికే తీరంలో క్షిపణి పరీక్షా కేంద్రం, మచిలీపట్నం పోర్టు పనులు

జిల్లాలో 111 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. ఇప్పటికే నాగాయలంక మండలం గుల్లలమోదలో క్షిపణి పరీక్షా కేంద్రం పనులు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ క్షిపణి పరీక్షా కేంద్రాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో పాటు మచిలీపట్నంలో పోర్టు పనులు చేస్తున్నారు. ఇప్పటికే 45 శాతం పనులు పూర్తయ్యాయి. ఇంకో రెండేళ్లలోపు మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

శుభ పరిణామం : మంత్రి కొల్లు



మచిలీపట్నంలో షిప్‌యార్డు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఇదొక శుభపరిణామమని గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హర్షం వ్యక్తం చేశారు. గోవా తరహా షిప్ యార్డు వల్ల మచిలీపట్నం చుట్టుపక్కల నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. తూర్పు తీర ప్రాంతంలో ఇలా ఒక పెద్ద ప్రాజెక్టు తీసుకొచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డుతో గోవా షిప్ యార్డు లిమిటెడ్ ఒప్పందం కుదుర్చుకుందన్నారు.

శివోహం



పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి ఆలయంలో విశేష అలంకారం

కార్తీక మాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని జిల్లాలోని శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భారీగా తరలివచ్చి శివలింగాలకు ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా వత్తులు వెలిగించారు. మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి ఆలయంలో పరమేశ్వరుడిని విశేషంగా అలంకరించారు. గుడివాడ పట్టణంలోని శివాలయం కార్తీక దీపాలతో దేదీప్యమానంగా ప్రకాశించింది.



గుడివాడ పట్టణంలోని శివాలయంలో వత్తులు వెలిగిస్తున్న భక్తులు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దాలిపర్రు, చింతలమడ, ఘంటసాల రైతులు

రొయ్యల చెరువులతో నష్టపోతున్నాం

డ్రెయినేజీ ఆక్రమించి అక్రమంగా రొయ్యల సాగు

- ఆ నీటితో పంట భూములు నాశనం
- కలెక్టరేట్ ఎదుట మూడు గ్రామాల రైతుల ధర్నా

మచిలీపట్నం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): డ్రెయినేజీ భూమి ఆక్రమించి తవ్విన చెరువుల్లో చేస్తున్న రొయ్యల సాగు వల్ల పంట భూములు దెబ్బతిని నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద దాలిపర్రు, చింతలమడ, ఘంటసాల గ్రామాల రైతులు ధర్నా నిర్వహించారు. చిల్లలవాగు నుంచి 100 మోటార్లతో నీటిని తోడుకుంటూ 300 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఇలా సాగు చేస్తున్న పంట పొలాలు రొయ్యల చెరువుల వల్ల నష్టపోయే ప్రమాదం ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడతూ లక్ష్మీపురంలో మురుగు కాల్వ కింద ఉన్న డ్రెయినేజీ భూమిని ఆక్రమించుకుని రొయ్యల చెరువుగా మార్చారని, దీని వల్ల మాగాణి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పేరుబోయిన శ్రీనివాసరావు అనే రైతు కట్టలు పోసి రొయ్యల చెరువులు చేస్తున్నారని, దీనిపై డ్రెయి నేజీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. రొయ్యల సాగుతో తమ పొలాలు ఉప్పు కయ్యలుగా మారి పోతాయన్నారు. అంతేకాక, ఆక్రమిత భూము లకు పట్టాలిప్పించేందుకు స్థానిక రెవెన్యూ అధికారులు ప్రయత్నం చేస్తున్నారని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు నూకల సురేష్, జి.శివ ప్రసాద్, పూర్ణచంద్రరావు, కుటుంబరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, నూదాని నాని పాల్గొన్నారు.

రూ.లక్షల్లో జరుగుతున్న లావాదేవీలు ఆ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగిలో దురాశ కలిగించాయి. కళ్ల ఎదురుగా నోట్ల కట్టలను చూసేసరికి కళ్లు తిప్పుకోలేక పోయాడు. ఎలాగైనా విలాసవంతమైన జీవితం గడపాలనుకున్నాడు. తమ్ముడితో కలిసి చోరీకి ప్రణాళిక వేశాడు. చివరికి పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు.

కట్టలకు ఆశపడి కటకటాల్లోకి..

- ప్రకాశం జిల్లాకు చెందిన అన్నదమ్ముల పనే..
- పనిచేసిన సంస్థలోని డబ్బుపైనే అన్న కన్ను
- తమ్ముడి సాయంతో చాకచక్యంగా చోరీ

రాయగడ ఎక్స్‌ప్రెస్‌లో రూ.87 లక్షల చోరీ నిందితుల అరెస్టు

పోలీసులా వచ్చి.. దొంగలా దోచుకుపోయి..

విజయవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్‌లో రూ.87 లక్షలు ఉన్న బ్యాగ్‌ను కాజేసిన నిందితులను జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను జీఆర్పీ డీఎస్పీ రత్నరాజు నగరంలోని రైల్వే ఎస్పీ కార్యాలయంలో వెల్లడించారు. ప్రకాశం జిల్లాకు చెందిన బూదల లలిత్‌బాబు.. విజయనగరం జిల్లా తెర్లాం గ్రామంలో ఉన్న ఓ పౌల్ట్రీలో హెచ్‌ఆర్ గుమస్తాగా పనిచేస్తున్నాడు. పౌల్ట్రీ ప్రధాన కార్యాలయం గుంటూరులో ఉంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పౌల్ట్రీల్లోని నగదును ఎప్పటికప్పుడు ప్రధాన కార్యాలయానికి తరలిస్తారు. ఈ నగదును తీసుకెళ్లడానికి ప్రధాన కార్యాలయం నుంచి ఒక మేనేజర్‌ను ఆయా పౌల్ట్రీలకు పంపుతారు.

వీవోఐపీల ద్వారా సమాచారం

సెల్‌ఫోన్లలో మాట్లాడుకున్నా, వాట్సాప్ కాల్స్ చేసినా పోలీసులు పసిగట్టేస్తారనుకున్న లలిత్‌బాబు వీవోఐపీ (వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రొటోకాల్) ద్వారా కాల్స్ మాట్లాడుకునేవాడు. నాగరాజు బీ1 బోగీలో ఎక్కుతున్నాడని సమాచారం ఇచ్చాడు. అశోక్‌కుమార్ మఫ్టీలో ఉండే పోలీసు మాదిరిగా తయారయ్యాడు. తలపై టోపీ పెట్టుకుని, మాస్క్ ధరించి పోలీసు మాదిరిగా వైజాగ్ రైల్వేస్టేషన్‌లో బోగీలోకి ఎక్కాడు. అక్కడి నుంచి విజయవాడ వరకు ప్రయాణించాడు. నాగరాజు లోయర్ బెర్త్‌పై గాఢనిద్రలో ఉన్నాడు. 1వ తేదీ తెల్లవారుజామున 3 గంటల సమయంలో దీన్ని గమనించి బెర్త్ కింద ఉన్న నగదు బ్యాగ్‌ను కాజేశాడు. రైలు విజయవాడ స్టేషన్‌కు రాగానే ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంపై దిగి ప్రయాణికుడిలా బయటకు వచ్చాడు. అక్కడి నుంచి ఆటోలో వారధి దాటి తాడేపల్లి వరకు వెళ్లాడు. అక్కడ బస్సు ఎక్కి మంగళగిరి చేరుకున్నాడు. ప్రకాశం జిల్లాకు బస్సులో వెళ్లాడు. తర్వాత తెర్లాం నుంచి లలిత్‌బాబు ప్రకాశం జిల్లాకు వెళ్లాడు. ఇద్దరూ కలిసి రూ.87 లక్షల్లో రూ.2.50 లక్షలను ఖర్చు చేశారు. మిగిలిన డబ్బుతో చెన్నైలో ఆస్తులు కొనడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. నాగరాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన జీఆర్పీ పోలీసులు సాంకేతికంగా మిగతా 6లో..



నిందితులను అరెస్టు చేసి వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రత్నరాజు

రెండు సార్లు విఫలయత్నం

తెర్లాం పౌల్ట్రీలో ఉన్న రూ.87 లక్షలను తీసుకెళ్లడానికి గుంటూరులోని ప్రధాన కార్యాలయ మేనేజర్ నాగరాజు కొద్దిరోజుల క్రితం అక్కడికి వెళ్లాడు. దీన్ని గమనించిన హెఆర్ గుమస్తా లలిత్‌బాబుకు దురాశ కలిగింది. డబ్బును పౌల్ట్రీలో కాజేస్తే దొరికిపోతానని భావించిన అతడు దాన్ని తరలించే మార్గంలో చోరీ చేస్తే దొంగలపైకి ఆ నేరం వెళ్తుందనుకున్నాడు. ఈ ప్రణాళికలో తన సోదరుడు అశోక్‌కుమార్‌ను భాగస్వామిని చేశాడు. నాగరాజు నగదును ఎక్కువగా బస్సులో తీసుకెళ్తుంటాడు. దీన్ని గమనించిన లలిత్‌బాబు రెండు సార్లు బ్యాగ్‌ను మాయం చేయడానికి ప్రయత్నించినా కుదరలేదు. గతనెల 31వ తేదీన నాగరాజు రూ.87 లక్షల బ్యాగ్‌తో గుంటూరుకు బయల్దేరుతున్న విషయం తెలుసుకున్న లలిత్‌బాబు తన సోదరుడు అశోక్‌కుమార్‌కు సమాచారం ఇచ్చాడు. ఆరోజు బస్సు ప్రయాణం వీలు కాకపోవడంతో నాగరాజు విశాఖపట్నం వచ్చి రాయగడ-గుంటూరు రైలులో బీ1 బోగీలో ఎక్కాడు.

సహకార రంగంపై రాజకీయ పెత్తనం!

ఉద్యోగుల బదిలీల ప్రక్రియను అడ్డుకుంటున్న ప్రజాప్రతినిధులు


- సహకార వ్యవస్థను గాడిలో పెడుతుంటే అడ్డంకులు సృష్టిస్తున్న రాజకీయ నేతలు
- ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల తీరుపై విమర్శలు చేస్తున్న రైతులు

ఆంధ్రజ్యోతి-అవనిగడ్డ: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో అవినీతి, అక్రమాలను అడ్డుకునేలా హెచ్‌ఆర్ పాలసీ ప్రకారం నియామకాలు చేపట్టేందుకు, సక్రమంగా లేనివి నిరోధించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబరు 36 అమలుకు అధికార పార్టీ నేతలే అడ్డంకిగా మారుతున్నారు. గత వైసీపీ హయాంలో ఇష్టమొచ్చినట్టు జరిగిన నియామకాలను నిరోధించేలా సహకార రంగంలో బదిలీ ప్రక్రియను చేపట్టడానికి గత అక్టోబరు 31న కృష్ణా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ ఓ తీర్మానం చేసింది. ఈ తీర్మానంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పని చేసే సిబ్బందికి పాటించాల్సిన విధివిధానాలను స్పష్టంగా తెలియజేసింది. సహకార రంగాల చట్టం 1964 ప్రకారం హెచ్‌ఆర్ పాలసీని అన్ని సంఘాల్లో అమలు చేయాలని, ఈ పాలసీ అమలులో భాగంగా సంఘ ముఖ్య నిర్వహణాధికారి, సహకార రంగ సిబ్బంది నియామకాలు, బదిలీ, ఇంచార్జ్, ఎఫ్ఏసీ, ప్రమోషన్ తదితరాలు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ నందు ఉన్న డీఎల్‌ఈసీ కమిటీ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. సహకార సంఘ పర్సన్ ఇంచార్జ్ కమిటీ లేక సంఘ సీఈవో ఎట్టి పరిస్థితుల్లోనూ సిబ్బంది నియామకం, బదిలీ, ప్రమోషన్ల విషయంలో తమకు తాముగా నిర్ణయం తీసుకోరాదని, సంఘంలో సీఈవో లేక ఇతర సిబ్బంది పోస్టులు ఖాళీలు ఏర్పడిన సమయంలో డీఎల్‌ఈసీలోని పీఏసీఎస్ హెచ్‌ఆర్ సెల్ వారికి రాతపూర్వకంగా తెలపాలని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సహకార అధికారులు సర్క్యూలర్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎల్‌ఈసీకి సహకార సంఘాల్లోని సీఈవో, ఇతర సిబ్బందిని బదిలీ చేసే అధికారాన్ని కల్పిస్తూ డీఎల్‌ఈసీ తీసుకునే నిర్ణయానికి సంఘ పర్సన్ ఇంచార్జ్ కమిటీ కట్టుబడి ఉండాలని నిర్ణయించి, మరో సర్క్యూలర్‌ను అన్ని బ్యాంకులకు పంపించారు. ఇదే విషయమై గత అక్టోబరు 14న అప్పటి వరకు జరిగిన తాత్కాలిక మిగతా 6లో..


నగరాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్

మరుపిళ్ల తిరుమలేశ్ మృతి

మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్ తదితరుల నివాళి



మరుపిళ్ల తిరుమలేశ్ (ఫైల్)



తిరుమలేశ్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, టీడీపీ నాయకులు బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా

వన్‌టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కొత్తపేటలోని టీడీపీ సీనియర్ నాయకుడు, ఆంధ్రప్రదేశ్ నగరాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మరుపిళ్ల తిరుమలేశ్ (60) సోమవారం మృతిచెందారు. అనారోగ్యం కారణంగా నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన కన్నుమూశారు. గవర్నర్‌పేట ఏఎంసీ కాంప్లెక్స్‌లో ఎలక్ట్రికల్ స్పేర్‌పార్ట్స్ షాపు నిర్వహిస్తున్న తిరుమలేశ్ చాలాకాలం నుంచి టీడీపీలో క్రియాశీలకంగా ఉంటున్నారు. అనారోగ్యం కారణంగా కొన్ని నెలలుగా పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు తిరుమలేశ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. తిరుమలేశ్‌కు నివాళులర్పించిన వారిలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నూర్‌బాషా దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ కె.నాగుల్‌మీరా, నాగవంశీయుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణ, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, బీసీ సంఘం నాయకులు పోతిన మహేశ్, నూకాయమ్మ యాదవ్, బంకా నాగమణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే అన్న, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయ సత్యబాబు, ఏపీ నగరాల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్లు, మిగతా 6లో..

భళా.. బాపులపాడు..! 8

సకాలంలో అర్జీలు పరిష్కరించాలి

- కలెక్టర్ బాలాజీ
- మీ కోసంలో అర్జీల స్వీకరణ

నిలువెత్తు కష్టానికి నిబంధనాలు!



నందిగామ సీసీఐ కేంద్రంలో పత్తిని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ



సీసీఐ తిరస్కరించిన పత్తిని దిగాలుగా చూస్తున్న రైతు

మొంథా తుఫాను పత్తి రైతును నిండా ముంచింది. పంట దిగుబడి లేక నిస్సహాయ స్థితిలో ఉన్న అన్నదాతకు అండగా నిలవాల్సిన సీసీఐ పూర్తిగా వ్యాపార ధోరణితో నిబంధనల సాకు చూపుతూ కొనుగోళ్లకు ససేమిరా అంటోంది. భారీగా పెట్టుబడులు పెట్టినా నాలుగోవంతు దిగుబడి కూడా రాక.. పండిన కొద్ది పాటి పత్తిని అమ్ముకోలేని దుస్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తీసుకుంటే తప్ప సీసీఐ కొనుగోళ్లు ముందుకు సాగే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- మొంథా సాకుతో పత్తి రైతుకు మొండిచేయి
- నాణ్యత లేదని కొనేందుకు సీసీఐ నిరాకరణ
- మార్కెట్ యార్డులోనే వందల బోరాల పత్తి
- కేంద్రానికి లేఖరాసినా స్పందన లేని వైనం
- కలెక్టర్‌కు మొరపెట్టుకున్నా తీరని వెతలు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాత దిగాలు
- ముఖ్యమంత్రి చొరవచూపాలని వేడుకోలు

నందిగామ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను కష్టం నుంచి అన్నదాతను ఆదుకునేందుకు నెలరోజుల క్రితం ఆర్భాటంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన సీసీఐ ఇంత వరకూ రైతుల నుంచి పత్తి కొనుగోళ్లు జరపలేదు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో పలు కథనాలు రావడంతో స్పందించిన మార్కెటింగ్ శాఖ అధికారులు సీసీఐ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపారు. ఎట్టకేలకు నందిగామ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కేంద్రంలో పత్తి కొనేందుకు సీసీఐ సిద్ధమైంది. సోమవారం రైతులు సుమారు మూడు వందల బోరాల పత్తిని యార్డుకు తరలించారు. కానీ పత్తిని కొనుగోలు చేసేందుకు సీసీఐ అధికారులు నిరాకరించారు. సీసీఐ నిబంధనల ప్రకారం పత్తిలో నాణ్యత లేనందున కొనుగోలు చేయలేమని స్పష్టం చేశారు. సీసీఐపై ఆశతో పత్తిని తెచ్చామని, తిరిగి ఇంటికి తీసుకువెళ్లి ఏంచేయాలని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రైవేటు వ్యాపారులు పూర్తిగా కొనుగోళ్లు నిలిపివేశారని, ఈ పరిస్థితుల్లో సీసీఐ కూడా వ్యాపార ధోరణితో ఆలోచిస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో పత్తి నాణ్యత తగ్గినందున సీసీఐ నిబంధనలు సడలించి కొనుగోలు చేయాలని వ్యవసాయ మంత్రి అచ్చెంనాయుడు కేంద్రానికి రాసిన లేఖకు నేటికీ స్పందనలేదు. ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాకపోవడంతో సీసీఐ బయ్యర్లు పత్తిని కొనుగోలు చేయడం లేదు. నిబంధనల పేరుతో పత్తి రైతుకు సహకరించని సీసీఐపై ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా ఒత్తిడి తెచ్చి తక్షణం నిబంధనలు సడలిస్తే తప్ప పత్తి రైతు కోలుకొనే పరిస్థితి కనిపించడం లేదు.

స్వయంగా కలెక్టర్ చెప్పినా..

నందిగామ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లను పరిశీలించేందుకు వచ్చిన జిల్లా కలెక్టర్‌కు అన్నదాతలు తమ ఆవేదన చెప్పుకున్నారు. దీంతో కలెక్టర్ సీసీఐ బయ్యర్, మార్కెటింగ్‌శాఖ అధికారులను పిలిచి మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల మాదిరిగా నాణ్యత ఆధారంగా ధర ఇచ్చి పత్తిని కొనుగోలు చేయాలని సూచించగా.. నిబంధనలకు లోబడి మాత్రమే పత్తిని కొంటామని వారు స్పష్టం చేశారు. సీసీఐతో పాటు ప్రైవేటు వ్యాపారులు కూడా ఇక్కడే కొనుగోలు చేయించే ఏర్పాటు చేయాలని కలెక్టర్ మార్కెటింగ్ అధికారులకు తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ సీసీఐ జనరల్‌మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తుఫాను ప్రభావంతో పత్తి నాణ్యత తగ్గిందని, నిబంధనలు సడలించి కొనాలని కోరారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరిందని చెప్పారు. కలెక్టర్ మాట్లాడినా నిబంధనలు దాటి కొనేది లేదని సీసీఐ జీఎం స్పష్టం చేశారు. దీంతో కలెక్టర్ తక్షణమే పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరిస్తానని రైతులు అధైర్యపడవద్దని చెప్పారు.

నీరసించిపోతున్న అన్నదాతలు

పెట్టిన పెట్టుబడులు పోగా పత్తితీతలకే క్వింటాకు మూడు నుంచి నాలుగు వేలు ఖర్చుచేసిన రైతులు సదరు పంట అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి ఎదురుకాలేదన్నారు. నందిగామ యార్డులో పత్తి కొంటామని ఆదివారం సాయంత్రం సీసీఐ ప్రకటించగా.. అన్నదాతల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. హుటాహుటిన ఆన్‌లైన్ చేయించుకొని సోమవారం తెల్లవారేసరికి యార్డుకు చేరుకున్నారు. తీరా కొనుగోలు చేయకపోవడంతో డీలా పడ్డారు. తిరస్కరించిన పత్తిని ఇంటికి తీసుకువెళ్లి ఏం చేయాలంటూ దైన్యంగా కనిపించారు.

చంద్రబాబుది అభివృద్ధి పాలన జగన్మోహన్ రెడ్డిది అరాచక పాలన

- ఎంపీ కేశినేని శివనాథ్



వన్‌టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబుది అభివృద్ధి పాలన అయితే జగన్మోహన్ రెడ్డిది అరాచక పాలన అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. సోమవారం గురునానాక్ కాలనీలోని పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశాఖపట్నంలో జరిగిన సదస్సులో రాష్ట్రానికి రూ.13.50లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ల కృషి కారణంగా ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు మారుతున్నాయన్నారు. ఏరోస్పేస్, డ్రోన్, ఆక్వా, క్వాంటమ్, ఐటీ, డేటా సెంటర్‌లు ఏపీకి వస్తున్నాయని, దీంతో రాష్ట్రం మొత్తం అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. ఏడాదిన్నర పాలనలో రాష్ట్రాన్ని గాడిలో పెట్టి సంక్షేమం, అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఒప్పందాలే కాదు, కొన్ని కంపెనీల ఏర్పాటుకు శంకుస్థాపన కూడా జరిగిందని, దీంతో యువతలో నూతన ఉత్తేజం వచ్చిందన్నారు. వైసీపీ సిగ్గులేకుండా ఆ కంపెనీలన్నీ మేమే తెచ్చామని ప్రచారం చేసుకుంటోందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో చాలా కంపెనీలు మూతపడ్డాయని, పారిశ్రామికవేత్తలు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయారన్నారు. సీఎం చంద్రబాబుపై నమ్మకంతో మళ్లీ ఏపీ వైపు చూస్తున్నారన్నారు. వచ్చే రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్ అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని, 20లక్షల ఉద్యోగాల కల్పన జరగబోతుందని తెలిపారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు మాట్లాడుతూ, ఏపీ అభివృద్ధి సీఎం చంద్రబాబు వల్లే సాధ్యమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అరాచకపాలన ప్రజలు అందరూ చూశారని, అనేక పరిశ్రమలు రాకుండా ఆనాడు వైసీపీ నాయకులు బెదిరించారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడే వైసీపీ నీచ రాజకీయాలకు ప్రజలు చెక్‌పెట్టాలన్నారు. ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య మాట్లాడుతూ ఏపీకి రూ.13.50 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. అబద్ధాలు చెప్పేవారిని ప్రజలు తరిమి కొట్టాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, నూర్‌బాషా దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ కె.నాగుల్‌మీరా, తదితరులు పాల్గొన్నారు.

సీఐఐ సదస్సు సూపర్ సక్సెస్

- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నంలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు అంచనాలకు మించి విజయవంతమైందని, ఈ సదస్సు ద్వారా రాష్ట్రంలో రూ.13.26 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఒప్పందాలు కుదుర్చుకోగా 16.13 లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, భాగస్వామ్య సదస్సు విశాఖపట్నంలో నిర్వహించినప్పటికీ ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ మూడు ప్రాంతాల్లోనూ సమానంగా పెట్టుబడులు పెట్టేలా మంత్రి లోకేశ్ పారిశ్రామికవేత్తలకు దిశానిర్దేశం చేశారని వివరించారు. పవర్ సెక్టార్, డ్రోన్ రెన్యువబుల్ ఎనర్జీ, టెక్స్‌టైల్ హబ్‌గా రాయలసీమ, క్వాంటం, ఆక్వా, పోర్టు ఆధారిత ఇండస్ట్రియల్ హబ్‌గా కోస్తాంధ్ర, డేటా టెక్నాలజీ, ఏఐ సంస్థలు ఉత్తరాంధ్రలో ఏర్పాటవుతున్నాయని, తద్వారా మూడు ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. వీటితో పాటు ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం ద్వారా పరిశ్రమలు వస్తాయని, తద్వారా నిరుద్యోగులకు స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విశాఖ సదస్సులో రూ.13.26 లక్షల కోట్ల పెట్టుబడులతో, 16.13 లక్షల మందికి ఉద్యోగాలు లభించేలా 613 ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు చెప్పారు. జగన్మోహన్ రెడ్డి వేధింపులతో భయపడి వెళ్లిపోయిన రెన్యూ, హీరో ఫీచర్స్, ఏబీసీ సంస్థలు రాష్ట్రానికి తిరిగి వచ్చి పెట్టుబడులు పెడుతుండటం చంద్రబాబుపై పారిశ్రామికవేత్తలకు ఉన్న నమ్మకానికి, కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనంగా పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ కృషితో రానున్న మూడేళ్లలో రాష్ట్రంలో పెద్దసంఖ్యలో పరిశ్రమలు ఏర్పాటు అవడంతోపాటు యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని యువతకు భరోసా ఇచ్చారు.

సీఎం ఆకాంక్షలకు అనుగణంగా స్మార్ట్ వర్క్ చేయండి

- ప్రభుత్వ కార్యదర్శి కాంతిలాల్ దండే

విజయవాడ సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు ఆకాంక్షలకు అనుగుణంగా ఉద్యోగులు స్మార్ట్ వర్క్ చేయాలని ఏపీ పర్యావరణ అటవీ శాఖ, సాంకేతిక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే సూచించారు. ఏపీపీఎస్సీ ద్వారా నూతనంగా నియమితులైన 39మంది ఉద్యోగులకు విజయవాడలోని పీసీబీ ప్రధాన కార్యాలయంలో సోమవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి కాంతిలాల్ దండే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులు వారివారి రంగాల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. ప్రతిష్ఠాత్మకమైన విద్యాసంస్థల్లో చదివి సవాళ్లతో కూడిన ఏపీపీసీబీలో విధులు నిర్వహించేందుకు వచ్చిన యువతీయువకులను అభినందించారు. ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని కాపాడటంలో బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. శాశ్విత ఉద్యోగులు చేరడంతో కాలుష్య నియంత్రణ మండలి బలోపేతం అవుతుందన్నారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పి.కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఎం.రాజశేఖర్, జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్ శ్రీరంజని పాల్గొన్నారు.

భవానీల భద్రతా ఏర్పాట్లపై అప్రమత్తం

- దీక్ష విరమణల్లో రద్దీ పెరిగే అవకాశం
- ఉద్యోగులు, సిబ్బందితో దుర్గగుడి చైర్మన్, ఈవో సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో డిసెంబరు 11 నుంచి 15 వరకు జరగనున్న భవానీ దీక్ష విరమణల్లో రద్దీ పెరిగే అవకాశముందని, ఉద్యోగులందరూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆలయ చైర్మన్ బి.రాధాకృష్ణ, ఈవో వీకే శీనానాయక్‌లు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మహామండపం 4వ అంతస్తులో చైర్మన్, ఈవోలు భవానీ దీక్ష విమరణల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో చేపట్టనున్న ఏర్పాట్లపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, భవానీ దీక్షల విరమణ సందర్భంగా డిసెంబరు 4న జరిగే కలశ జ్యోతి ఊరేగింపు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. దీక్ష విరమణల్లో భవానీలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇరుముడి పాయింట్లు, హోమగుండాల ఏర్పాట్లు, అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదం సమృద్ధిగా భక్తులకు అందేలా చూడాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. క్యూలు, తాగునీరు సరఫరా, వైద్య శిబిరాల ఏర్పాటు, గిరి ప్రదక్షిణ మార్గం, కేశఖండనశాలలు, భక్తుల పుణ్యస్నానాల ఏర్పాటుకు మైక్ ప్రచారం, ఉచిత బస్సు నిర్వహణ ప్రణాళిక ప్రకారం జరగాలని ఈవో అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖలతో జరిగే సమావేశంలో మరిన్ని అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్టు తెలిపారు. భవానీ దీక్షల విరమణ తొలిరోజు నుంచే రద్దీ పెరిగే అవకాశం ఉందని.. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో ఆలయ స్థానాచార్యుడు వి.శివప్రసాద్ శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు లింగంబొట్ల దుర్గాప్రసాద్, ఏసీ రంగారావు, ఏఈవోలు బి.వెంకటరెడ్డి, ఎన్.రమేష్ బాబు, సుధారాణి, చంద్రశేఖర్, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సివిల్స్ ప్రిలిమ్స్‌కు ఉచిత శిక్షణ

- బీసీ స్టడీ సర్కిల్ డైరక్టర్ లక్ష్మీదేవి

కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ సంచాలకుల ఆదేశాల మేరకు యూపీపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షకు ఉచిత శిక్షణ కావాలనుకొనే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరక్టర్ కె.లక్ష్మీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన డిగ్రీ పూర్తిచేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అర్హులని, బయోడేటాతో పాటు రెండు ఫొటోలు, విద్య, కుల, ఆదాయ తదితర ధృవీకరణ పత్రాల నకళ్లను అటెస్టేషన్‌తో దరఖాస్తుకు జత చేసి ఈనెల 25లోగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి, డోరు నెం.74-2-1/5, అశోక్‌నగర్, పండరీపురం, రోడ్డు నెం.8, విజయవాడ -52007లో నేరుగా అందజేయాలని సూచించారు. స్ర్కీనింగ్ టెస్ట్ ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక జరగనుందని, ఎంపికైన అభ్యర్థులకు గొల్లపూడిలోని బీసీ భవన్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, శిక్షణ కాలంలో ఉచిత బస, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్టు తెలిపారు. ఇతర వివరాలకు 9966849937, 8688855255, 9505094349 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని లక్ష్మీదేవి పేర్కొన్నారు.

కట్టలకు ఆశపడి..

(5వ పేజీ తరువాయి)

దర్యాప్తు చేపట్టారు. వైజాగ్, విజయవాడ రైల్వేస్టేషన్లలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. ముందుగా పోలీసులు అశోక్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత లలిత్‌బాబు పేరు బయటకొచ్చింది. వారి నుంచి రూ.84.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ జేవీ రమణ, ఆర్పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ పొన్నుస్వామి, ఇన్‌స్పెక్టర్ ఫతే ఆలీ బేగ్‌తో పాటు సిబ్బందిని అధికారులు అభినందించారు.

బందరు పడవ!

(5వ పేజీ తరువాయి)

రూ.6,500 కోట్లతో నిర్మించే ఈ షిప్‌యార్డు ద్వారా మూడు వేలమంది మెరైన్ విభాగంలో ఇంజనీర్‌లకు ప్రత్యక్షంగా, మరో మూడు వేల మందికి పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపినట్లు సమాచారం. దీంతో పాటు మరికొంతమందికి సాంకేతికపరమైన శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కూడా ఇస్తామని ఒప్పందంలో పేర్కొన్నట్టు సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. షిప్‌యార్డు నిర్మాణంతో ఇక్కడే ఓడల తయారీ, ఇతరత్రా పెద్ద బోట్‌లు, ఓడలకు సంబంధించిన మరమ్మతులు, అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు అవుతాయని, తద్వారా ఈ ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందుతుందని సాంకేతిక నిపుణుల మాటగా ఉంది.

రెండు చోట్ల నిర్మాణానికి అనుకూలం!

గోవాలో సముద్రానికి అనుబంధంగా ఉన్న పెద్ద కాల్వ పక్కనే గోవా షిప్‌యార్డు ఉంది. ఇక్కడ ఆధునిక పద్ధతిలో తయారు చేసిన ఓడలు నేరుగా షిప్‌యార్డు పక్కన ఉన్న కాల్వ ద్వారా సముద్రంలోకి వెళ్లేలా ఏర్పాట్లు ఉన్నాయి. మచిలీపట్నంలో షిప్‌యార్డు నిర్మాణం ఎక్కడ ఏర్పాటు చేస్తే ఓడలు నేరుగా సముద్రంలోకి వెళ్లేందుకు అవకాశం ఉంటుందనే అంశంపై ఇప్పటికే ఒక అంచనాకు వచ్చినట్లు సమాచారం. కృష్ణానది సముద్రంలో కలిసే ప్రాంతమైన మచిలీపట్నం సౌత్ మండలంలోని కమ్మవారిచెరువు, కొత్తపల్లె తుమ్మలపాలెం, మాలకాయలంక గ్రామాల వద్ద ఈ షిప్‌యార్డు నిర్మాణం చేయాలనే ఆలోచన ఉన్నట్లు తెలిసింది. మాలకాయలంక, కొత్తపల్లె తుమ్మలపాలెం వద్ద కృష్ణానది సముద్రంలో కలుస్తుంది. ఈ గ్రామాల వద్ద కృష్ణానది మధ్య భాగంలో 20 నుంచి 25 మీటర్ల లోతు ఉంటుంది. కొత్తపల్లె తుమ్మలపాలెం, మాలకాయలంక గ్రామాల నుంచి కృష్ణానది సుమారుగా ఐదు కిలోమీటర్ల దూరం ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. ఈ గ్రామాల్లో వేలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. షిప్‌యార్డు నిర్మాణానికి అన్నివిధాల అనుకూలంగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కృష్ణానదిలో నుంచి సాగర సంగమం జరిగే ప్రాంతం ద్వారా ఓడలు నేరుగా సముద్రంలోకి వెళ్లేందుకు సహజసిద్ధంగా ఏర్పాట్లు ఉండటంతో ఈ ప్రాంతంలో షిప్‌యార్డు నిర్మించేందుకు తొలి ప్రాధాన్యత ఉంటుందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రాంతం కాకుంటే మచిలీపట్నం నార్త్ మండలంలోని పెదపట్నం-కానూరు గ్రామాల మధ్యగుండా లజ్జంబండ డ్రెయినేజీ సముద్రంలో కలుస్తుంది. ఈ ప్రాంతాన్ని షిప్‌యార్డు నిర్మాణం చేసేందుకు రెండో ప్రాధాన్యతగా ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే షిప్‌యార్డు నిర్మాణానికి భూసేకరణ త్వరితగతిన పూర్తి చేసి భూమిని అప్పగిస్తామని రెవెన్యూ ఉన్నతాధికారులు చెబుతున్నారు. కాగా, గోవా షిప్‌యార్డు, ఏపీ మారీటైమ్‌బోర్డు ద్వారా మచిలీపట్నంలో షిప్‌యార్డు నిర్మాణం జరిగితే ఈ ప్రాంతం పారిశ్రామికంగా భవిష్యత్తులో మరింత అభివృద్ధి జరుగుతుందనేది సాంకేతిక నిపుణుల అంచనాగా ఉంది.

లక్ష దీపోత్సవం

సంతోషిమాత కమిటీ, జయహో భారతీయం సంయుక్త ఆధ్వర్యంలో సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో సోమవారం కార్తీక లక్ష దీపోత్సవం జరిగింది. కార్యక్రమానికి మూడువేల మందికి పైగా భక్తులు హాజరయ్యారు. రుద్రహోమం, శివపార్వతి కల్యాణం, బిల్వార్చన, సామూహిక లక్ష దీపార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త గోకరాజు గంగరాజు, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. (విజయవాడ కల్చరల్)





నగరాల కార్పొరేషన్ చైర్మన్ మరుపిళ్ల మృతి

(5వ పేజీ తరువాయి)

పలువురు కార్పొరేటర్లు ఉన్నారు.

పదవులు ఆశించని నిఖార్సైన నాయకుడు

ఏ పదవీ ఆశించకుండా టీడీపీలో నిఖార్సైన కార్యకర్తగా పనిచేసిన మరుపిళ్ల తిరుమలేశ్‌ను అధిష్ఠానం గుర్తించింది. ఏపీ నగరాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా పట్టంకట్టింది. తనకు పార్టీ ఇచ్చిన గుర్తింపును అనుభవించేలోపే ఆయన మృతిచెందడం బాధాకరం. పశ్చిమ నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం కృషిచేసిన వారిలో తిరుమలేశ్ ఒకరు. టీడీపీ స్థాపించిన నాటి నుంచి నిఖార్సైన కార్యకర్తగా నిబద్ధతతో పనిచేశారు. ఏనాడూ డివిజన్, నియోజకవర్గ స్థాయిలో పదవులను ఆశించలేదు. ఇచ్చినా సున్నితంగా తిరస్కరించేవారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ అధికారంలోకి రాగానే ఏపీ నగరాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌ను చేసింది. అక్టోబరు 5న ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత రెండు, మూడు రోజులకే ఆసుపత్రిలో చేరారు. నాటి నుంచి చికిత్స పొందుతున్నారు. నగరాల కులస్తులు రాష్ట్రవ్యాప్తంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఆయన ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

టీడీపీకి తీరని లోటు : ఎంపీ కేశినేని శివనాథ్

తిరుమలేశ్ మృతి పార్టీకి తీరని లోటని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్యే సుజనా చౌదరి దిగ్భ్రాంతి

తిరుమలేశ్ మృతిపై పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. నిబద్ధతతో, నిజాయితీతో కష్టపడి పనిచేసిన ఆయన నగరాల కార్పొరేషన్ చైర్మన్ పదవిని పొందారన్నారు. ఆయన మరణం తీరని లోటని, ఆయన కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఎక్స్ వేదికగా ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సహకార రంగంపై రాజకీయ పెత్తనం!

(5వ పేజీ తరువాయి)

బదిలీలన్నింటినీ ఆమోదించారు. అనంతరం ఈ నెల 11న నిర్వహించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల యందు సిబ్బంది కొరత కారణంగా చేపట్టాల్సిన తాత్కాలిక నియామకాల గురించి, వేతన చెల్లింపు పారదర్శకాల గురించి చర్చించి అన్ని సంఘాలకు తీర్మానాలను పంపించారు.

తీర్మానాలకు అడ్డుకట్ట వేస్తున్న ప్రజాప్రతినిధులు

జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ ఈ నెల 11న పంపించిన డీఎల్‌డీసీ సమావేశంలో ఆమోదించిన మార్గదర్శకాలకు అధికార పార్టీ సభ్యులే ఆటంకాలు సృష్టిస్తున్నారన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. నాటి సమావేశంలో పీఏసీఎస్ ఉద్యోగులు తాత్కాలికంగా ఇతర పీఏసీఎస్‌లకు బదిలీ అయినప్పుడు ఏ పీఏసీఎస్‌కైతే బదిలీ అవుతారో ఆ పీఏసీఎస్ నుంచి జీతభత్యాలు తీసుకోవాలని, అదనపు బాధ్యతలు ఇచ్చిన సందర్భాల్లో పని చేసిన కాలానికి సంబంధించి టీఏ, డీఏలను కూడా అదే సొసైటీల నుంచి పొందాలని తీర్మానించారు. డీఎల్ఈసీ కన్వీనర్ ద్వారా చేపట్టిన తాత్కాలిక బదిలీలను అందరూ పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జ్‌లు విధిగా అంగీకరించాలని ఆదేశాలు జారీ చేయగా, వీటిని అడ్డుకునేందుకు కొందరు ఉద్యోగులు అధికార పార్టీ నేతలతో కలిసి పావులు కదుపుతున్నారు. లక్షలాది రూపాయల టర్నోవర్ ఉన్న పీఏసీఎస్‌ల్లో సిబ్బంది పెత్తనం కారణంగా సొసైటీల్లో ఏం జరుగుతుందో అర్థం కానీ పరిస్థితి ఉంది. సొసైటీల పాలన పారదర్శకంగా జరగాలంటే బదిలీల ప్రక్రియను తప్పనిసరిగా చేపట్టాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయానికనుగుణంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఇటీవల కొందరు సొసైటీ సీఈవోలను బదిలీ చేసింది. అయితే ఆయా సొసైటీల్లో పాతుకుపోయిన సీఈవోలు అప్పటికే వారు 2019 తర్వాత నియమించుకున్న స్టాఫ్ అసిస్టెంట్ల ప్రమోషన్లకు ఈ బదిలీలు అడ్డంకిగా మారతాయన్న ఉద్దేశ్యంతో రాజకీయ నేతలతో కలిసి బదిలీ ప్రక్రియ జరగకుండా ఆటంకాలు సృష్టిస్తున్నారని తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా 223 సొసైటీలకు గానూ 189 మంది సీఈవోలు ఉండగా, 36 సీఈవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్టాఫ్ అసిస్టెంట్లుగా 179 మంది పని చేస్తుండగా, వారిలో దాదాపు 50 మందికిపైగా 2019 తర్వాత రాజకీయ ప్రాబల్యంతో చేరిన వారే ఉండటం గమనార్హం. ఒక మండలంలోని ఒక సొసైటీలో సీఈవోగా పని చేస్తున్న వ్యక్తి తన బంధువులను అదే మండలంలోని ఇతర సొసైటీల్లో స్టాఫ్ అసిస్టెంట్లుగా నియమించుకుని పరస్పర సహకారంతో ఇంతకాలం వ్యవహారాలు నడుపుకుంటూ రాగా, ప్రస్తుతం ఖాళీగా ఉన్న 36 సీఈవో పోస్టుల్లో ఈ స్టాఫ్ అసిస్టెంట్లనే నియమించుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్న తరుణంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ బదిలీల ప్రక్రియ చేపట్టడంతో ఇది నియోజకవర్గాల్లో రాజకీయ దుమారాన్ని రేపుతోంది.

తొలి బదిలీనే అడ్డుకున్న అధికార పార్టీ నేతలు

జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఆధ్వర్యంలో ఇటీవల అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన ఓ సొసైటీ సీఈవోను వేరే మండలానికి బదిలీ చేయగా, అక్కడ పని చేస్తున్న సిబ్బంది రాజకీయ ప్రాబల్యాన్ని ఉపయోగించి ఆ బదిలీ ప్రక్రియను అడ్డుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ నెల 11న జరిగిన డీఎల్ఈసీ సమావేశంలో ఎట్టి పరిస్థితుల్లోనూ పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జ్‌లు డీఎల్ఈసీ చేపట్టిన తాత్కాలిక బదిలీలు అంగీకరించి తీరాలని సర్క్యులర్ జారీ చేసినప్పటికీ సదరు పీఏసీఎస్ చైర్మన్ డీఎల్ఈసీ నిర్ణయాన్ని ఆమోదించకుండా బదిలీ అయ్యి వచ్చి, చార్జ్ తీసుకునేందుకు ప్రయత్నించిన సీఈవోను వెనక్కి తిప్పిపంపారు. ఇదే విషయాన్ని సదరు సీఈవో జిల్లా ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారులు సదరు పీఏసీఎస్‌కు నోటీసులు కూడా జారీ చేశారు. అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు నియోజకవర్గ, జిల్లా స్థాయిలో తమకున్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఆ నోటీసులను వెనక్కి తీసుకునేలా ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఎవరైనా ఉద్యోగికి ఉన్నతాధికారుల ద్వారా అన్యాయం జరిగితే దానిపై పోరాటం చేయాల్సిన సంఘాల్లోని నాయకులు సైతం, తమ మండలాల్లో తాము 2019 తర్వాత నియమించుకున్న స్టాఫ్ అసిస్టెంట్లకు అడ్డదారిలో ప్రమోషన్ ఇప్పించేందుకు అన్యాయం జరిగినా సహకార ఉద్యోగులను కూడా పట్టించుకోని పరిస్థితి నేడు జిల్లా సహకార బ్యాంక్ పరిధిలోని సొసైటీల్లో కొనసాగుతుందని ఆరోపణలు ఉన్నాయి. సొసైటీల్లో పాలనను పారదర్శకంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని సహకార కేంద్ర బ్యాంక్‌ల ద్వారా డీఎల్ఈసీ కన్వీనర్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రక్షాళన కార్యక్రమానికి సొంత పార్టీ నేతల నుంచే అడ్డంకులు ఎదురవుతుండటం పట్ల పలువురు సీఈవోలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు కట్టుదిట్టంగా అమలయ్యేలా చర్యలు తీసుకుని, తమకు నాణ్యమైన సేవలు అందించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పెనమలూరు, నవంబరు17(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మోటారు సైక్లిస్టు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరుకు చెందిన జువ్వా యెల్లయ్య చౌదరి (45) ఆదివారం పొద్దుపోయిన తర్వాత గంగూరులో పని ఉందని ఇంట్లో చెప్పి మోటారుసైకిల్‌పై వెళ్లాడు. పని పూర్తి చేసుకొని 12 గంటల ప్రాంతంలో తిరిగి పెనమలూరు వస్తుండగా జాతీయరహదారిపై టిఫిన్ బండిని డీకొని కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ అతడిని ఆసుపత్రిలో చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.



కొలుసు రవీంద్రతో కేక్ కట్ చేయిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

కొలుసు రవీంద్ర పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే యార్లగడ్డ

ప్రసాదంపాడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండల టీడీపీ అధ్యక్షుడు కొలుసు రవీంద్ర జన్మదినోత్సవాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు క్యాంపు కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత కొలుసు రవీంద్ర చేత ఎమ్మెల్యే కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు. ఆయన సానుకూలంగా స్పందించి ఆయా అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. టీడీపీ పటిష్టత కోసం అంకితభావంతో పనిచేసే రవీంద్ర మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. టీడీపీ నాయకులు అట్లూరి శ్రీను, మణికొండ టీడీపీ పార్టీ అధ్యక్షడు రవి, ఉంగుటూరు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విభిన్న పుష్పాలతో మామిడిఅల్లం

మామిడిఅల్లం పంటలో పుష్పోల్లాసం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 17(ఆంధ జ్యోతి): పెరిగిన చలిగాలులతో మామిడి అల్లం పంట పుష్పాలతో కనువిందు చేస్తోంది. బాపులపాడుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు అక్కినేని రాఘవేంద్రరావు పెరటిలో పెంచుతున్న మామిడి అల్లం పుష్పాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. గత మూడు సంవత్సరాలుగా మామిడి అల్లం సాగు చేస్తున్నానని, ఈ సంవత్సరమే పూలు వచ్చాయని ఆయన తెలిపారు. చలిగాలులు, మంచుతో అరకు లాంటి ప్రాంతాల్లో మాత్రమే వచ్చే మామిడి అల్లం పంటకు పుష్పాలు ఇక్కడ కూడా వచ్చాయని ఉద్యానవనశాఖ అధికారి జోసఫ్ వివరించారు.



పుల్లేరుకాల్వ కట్టపై నిర్మిస్తున్న రేకుల షెడ్డు

రేకుల షెడ్డు తొలగించాలని నోటీసు

ఉయ్యూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు మున్సిపాలిటీ పరిధిలో అప్పర్ పుల్లేరు కాల్వకట్టపై రేకుల షెడ్డు నిర్మాణ పనులు నిలిపివేయాలని జలవనరుల శాఖ అప్పర్ గుడివాడ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీరు ఎస్ఎస్ పవన్‌కుమార్ ఆక్రమణదారులకు సోమవారం నోటీసు జారీ చేశారు. కాల్వ కట్ట ఆక్రమించి గోపరాజు వినయ్‌కుమార్ రేకుల షెడ్డు నిర్మాణ పనులు చేస్తున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు పరిశీలించి రెండురోజుల్లో షెడ్డు తొలగించాలని ఆదేశించారు. లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసు ఇచ్చినట్టు తెలిపారు.

శివ నామస్మరణలో శైవక్షేత్రాలు

● భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు



కలవపాముల దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో ..

ఉయ్యూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో ఉయ్యూరు, మండల పరిధిలోని గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. కార్తీకమాసం ఈనెల 20తో ముగుస్తున్న సందర్భంగా ఉదయం నుంచి శివాలయాలకు భక్తులు తరలివచ్చి దీపారాధన, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉయ్యూరు జగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో వేకువజామునుంచి భక్తుల రద్దీ కన్పించింది. కలవ పాముల దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. మహిళలు స్వామి వారిని దర్శిం చుకున్నారు. బోళ్లపాడు, కాటూరు, ముదునూరు, చిన ఓగిరాల, పెదఓగిరాల, ఆకునూరు గ్రామాల్లో శివాలయాల్లో భక్తులు పూజలుచేశారు. **హనుమాన్‌జంక్షన్ :** కార్తీక త్రయోదశిని పురస్కరించుకొని సోమవారం ఆలయంలో బాపులపాడు శివాలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. మరకత లింగేశ్వర స్వామికి మహాన్యా సపూర్వక రుద్రాభిషేకం, నందీశ్వరుడికి పంచామృతాభిషేకం జరిపారు. కార్తీకమాసం ఆఖరి సోమ వారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయాన్ని దర్శించి గోత్ర నామాలు పేరుతో పూజలు జరిపించారు. ఆలయ అర్చకులు సామవేదం మారుతిశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించగా ఆలయ కమిటీ నేతలు గూడవల్లి చిన్నా, తమిరి రమేష్, కొల్లి వెంకట్రావు, వీరమాచనేని నాగయ్య, రాంబాబు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. **హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో ఆలయాల్లో భక్తులు రద్దీ పెరిగింది. తెల్లవారుఝామునుండి శివాలయాల్లో భక్తులు కుటుంబాలతో కలిసి దీపారాధన చేసి ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. మడిచర్లలోని భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి ఆలయంలో భక్తులు బారులు తీరారు. వీరవల్లి గంగాపార్వతీ సమేత కొండేశ్వరస్వామి ఆలయంలో మురళీశర్మ ఆధ్వర్యంలో అభిషేక పూజ నిర్వహించారు. సింగన్నగూడెం, సిరివాడ, మల్లవల్లి తదితర గ్రామాల్లో హరహర మహాదేవ అంటూ భక్తుల నామస్మరణలతో శివాలయాలు మార్మోగాయి. పెరికీడులోని పంచాయతనక్షేత్ర ముక్తి కాంతా సమేత ముక్తేశ్వర స్వామికి అర్చకులు శ్యామ్, సీతారామయ్య ఆధ్వర్యంలో పంచామృతాభిషేక పూజలు నిర్వహించారు. కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు దంపతులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. చైర్మన్ దంపతులకు వేదాశీర్వచనంలో కూడిన స్వామి వారి శేషవస్త్రాన్ని అర్చకులు కమిటీ సభ్యుల ద్వారా అందజేశారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ వాసు దంపతులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. సభ్యులు నండూరి శర్మ, నక్కా బాబు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పెరికీడు శ్రీముక్తేశ్వరస్వామి ఆలయంలో..



బాపులపాడు శివాలయంలో ..



పూజల్లో పాల్గొన్న భక్తులు

రైతులకు అండగా వ్యవసాయ శాఖ

● వ్యవసాయశాఖ అధికారి ఎన్. పద్మావతి

కంకిపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ రైతులకు ఉంటుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్. పద్మావతి అన్నారు. వరి కోతలను ఆమె సోమవారం పరిశీలించారు. పద్మావతి మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్ట పోయారన్నారు. ప్రభుత్వం ఇప్పటికే నష్ట నివారణ చర్యలు చేపట్టిందన్నారు. నష్ట పరిహారం వివరాలు సేకరించి ప్రభుత్వానికి అందజేశామన్నారు. బాగున్న పంటలకు సంబంధించిన కోతలు ముమ్మరంగా సాగుతున్నాయని తెలియజేశారు. మండలంలోని దావులూరు, నెప్పల్లి గ్రామాల్లో వరి కోత ప్రయోగం నిర్వహించామని తెలియజేశారు. పలు ప్రాంతాల్లో నిర్వహించిన ఈ ప్రయో గంలో రైతులకు సుమారు 74 కేజీల బస్తాలు 34 వరకు దిగుబడి వస్తుందని అంచనాకు రావడం జరిగిందని తెలియజేశారు. ఏవో ఉషారాణి పాల్గొన్నారు.



వరి కోత ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎన్. పద్మావతి, ఏవో ఉషారాణి

కాటూరులో ముమ్మరంగా వరికోతలు



కాటూరులో వరికోతలు కోస్తున్న కూలీలు

ఉయ్యూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. మొంథా తుఫాను కారణంగా కోతలు ఆలస్యం అయ్యాయి. తరుణం మించిపోతున్ననేపథ్యంలో రైతులు ఒకేసారి కోతలు కోయించేందుకు తొందరపడడంతో కూలి రేట్లు అమాంతం పెరగాయి. కోతకోసేందుకు ఎకరాకు రూ.6వేల వరకు కూలీలు డిమాండ్ చేస్తున్నారు. కూలి ఖర్చు, వాతావరణ మార్పుల పరిస్థితుల్లో యంత్రాలతో కోత కోయించేందుకు రైతులు మొగ్గుచూపుతుంటే యంత్రాలు అందుబాటులో లేక ఇబ్బంది పడుతు న్నారు. మండలంలో 13,700 ఎకరాల్లో వరిసాగు చేయగా దాదాపు అన్ని గ్రామాల్లో కోతలు ఒకే సారి రావడంతో కూలీలు, యంత్రాల కొరత నెలకొంది. శ్రీకాకుళం, గోదావరి జిల్లాల నుంచి కూలీలను తీసుకువచ్చి కొందరు కోతలు కోయిస్తున్నారు.

రేమల్లె, అంపాపురంలో వైభవంగా అయ్యప్ప పడిపూజ



రేమల్లె అయ్యప్పస్వామి ఆలయంలో పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : రేమల్లెలో అక్కినేని బాపూజీ గురస్వామి ఆధ్వర్యంలో రాజీవ్ నంబూద్రి పర్యవేక్షణలో ఆదివారం రాత్రి నిర్వహించిన పడిపూజలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. అంపాపురంలో వలివేటి కిషోర్ ఆధ్వర్యంలో ధనుష్ నంబూద్రి పర్యవేక్షణలో కలశపూజ, అభిషేకంలో ఆయన పాల్గొన్నారు. అంపాపురంలో ధనుష్‌నంబూద్రి పర్యవేక్షణలో అయ్యప్పస్వామి సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించి విశేషహారతి ఇచ్చారు. తడికమళ్ల ప్రసాద్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన భజన కార్యక్రమంలో వేలాదిగా అయ్యప్పలు పాల్గొన్నారు. మురళి గురుస్వామి, యాళ్ల శ్రీధర్, రాజా, తదితరులు పాల్గొన్నారు. రేమల్లెలో అయ్యప్పస్వామి ఆలయంలోని పదునెట్టాంబడి (18మెట్లను) పూలమాలలతో అలంకరించి గణపతి కుమారస్వామిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, గుజ్జర్లపూడి బాబూరావు, మూల్పూరి సాయికళ్యాణి, డైరెక్టర్ ఆదియ్య, నారాయణ, చంద్రకాంత్, కలపాల సూర్యనారాయణ స్వామి, రాధాకృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



అంపాపురంలో అయ్యప్పస్వామి కలశపూజామహోత్సవంలో..

ఆటోడ్రైవర్‌కు జరిమానా, వారం జైలు

విద్యాధరపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాన్ని నడిపిన ఆటో డ్రైవర్ లక్ష్మణరావుకు కోర్టు సోమవారం రూ.10 వేలు జరిమానా, వారం రోజులు జైలు శిక్ష విధించింది. యనమలకుదురుకు చెందిన లక్ష్మణరావు నెలరోజుల క్రితం మద్యం తాగి భవానీపురం స్వాతి సెంటర్ వద్ద ఆటో నడిపాడు. ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో స్టేషన్ పరిధిలో సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి ఆటో నడుపుతున్న లక్ష్మణరావును అదుపులోకి తీసుకుని అతనిపై కేసు నమోదు చేశారు. పోలీసులు పలుసార్లు కోర్టుకు రమ్మని సమాచారం ఇచ్చినా తప్పించుకుని తిరుగుతున్నాడు.పోలీసులు సోమవారం అతనిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా అతనికి రూ.10 వేలు జరిమానా, వారం రోజులు జైలుశిక్ష విధించింది.

దేవాలయానికి ఎకరం భూమి విరాళం

కంకిపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భూమి విలు వ ఆకాశాన్ని అంటినప్పటికీ దైవుడిపై విశ్వాసంతో కోట్ల రూపాయల విలువ చేసే భూమిని కోదండ రామాలయానికి దానం చేయడం అభిందనీయమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. తెన్నేరులోని కోదండరామాలయంలో ధూప, దీప నైవేద్యాలకు అవసరమైన ఎకరం భూమిని యార్లగడ్డ రామారావు, సరస్వతి దంపతులు సోమవారం దానంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పట్టు వస్త్రాలతో సత్కరించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ భూమి విలువలు ఆకాశాన్ని అంటాయన్నారు. అయినా కోట్ల రూపాయల విలువ చేసే ఎకరం భూమిని దైవ సంకల్పంతో అందించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాదెళ్ల పట్టాభిరామారవు, పద్మావతి దంపతులు, మిక్కిలినేని సాయి సత్యనారాయణ, కళావతి దంపతులు, నాదెళ్ల భక్తవత్సలరావు, సాయి లీల దంపతులు, యార్లగడ్డ రాజారావు, అరుణకుమారి దంపతులు, నిమ్మగడ్డ నాగేశ్వరరావు, అరుణకుమారి దంపతులు, గ్రామ పెద్దలు మధుసూదనరావు, కృష్ణమూర్తి, ఉద్దండి కుటుంబరావు, కలపాల రాజశేఖర్‌రావు, ప్రతాప్, ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



చిన్నారులతో గ్రంథాలయాధికారి స్వర్ణలతాదేవి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థి దశ నుంచే వివిధ అంశాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని హెచ్ఎం మోహనకృష్ణ సూచించారు. వీరవల్లి గ్రంథాలయాధికారి స్వర్ణలతాదేవి ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సోమవారం చిన్నారులకు, విద్యార్థులకు విచిత్ర వేషధారణ, క్రీడా పోటీలు నిర్వహించారు. 70 మంది విద్యార్థులు పాల్గొన్న పోటీలను రత్నకుమారి, హేమలత, ఉషారాణి పర్యవేక్షించారు. కానుమోలు గ్రంథాలయాధికారి రహీం ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, తదితర పోటీలు నిర్వహించారు. మాజీ సైనికోద్యోగి దుప్పల రంగరావు, హిమబిందు, పద్మశ్రీ తదితర ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. తేలప్రోలు గ్రంథాలయంలో స్వాతంత్ర్య సమరయోధులు బొమ్మారెడ్డి సత్యన్నారాయణ, వింత ముత్తారెడ్డి తదితరులు చిత్రపటాలకు నివాళులర్పించారు. స్వాతంత్రోద్యమ చరిత్రను విద్యార్థులకు వివరించారు.

చిత్రలేఖనం పోటీలు

ఉయ్యూరు : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఉయ్యూరు, ముదునూరు శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఉయ్యూరు గ్రంథాల యంలో వక్తృత్వ, దేశభక్తి గేయాలు, ముదునూరులో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభకన బరిచారు. ఉపాధ్యాయురాలు కె.సుజాత, సాంబశివరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. వారోత్సవాల విశేషాలను గ్రంథాలయ అధికారులు రమణి, నాగరాజు తెలియజేశారు.



ముదునూరు గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలో విద్యార్థులు

నలుగురు జూదరుల అరెస్టు

హనుమాన్‌జంక్షన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి గ్రామంలో పేకాట శిబిరంపై ఆదివారం రాత్రి ఎస్సై వి.సురేష్ దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.870 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ...

విద్యాధరపురం: భవానీపురం శివాలయం సెంటర్ వద్ద సూరె మల్లికార్జునరావు ఇంటివద్దే చిల్లరకొట్టు నిర్వహిస్తున్నాడు. కార్తీక సోమవారం కావటంతో తెల్లవారు జామున 4.15 గంటలకు షాపు తెరిచాడు. కొద్దిసేపటి తరువాత ఆయన ఆరోగ్యం బాగాలేకపోవటంతో మల్లికార్జునరావు భార్య అంకరత్నం షాపునకు వచ్చి సామానులు సర్దుతుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి కొద్ది దూరంలో ఆగారు. ఒకరు కొట్టుకు వచ్చి ఆమె మెడలో ఉన్న నాలుగు కాసుల బంగారు గొలుసును లాక్కొని బైక్ వద్దకు పరుగెత్తాడు. అక్కడి నుంచి ఇద్దరు పరారీ అయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భళా.. బాపులపాడు..!

వైవిధ్యంతో కూడిన అభివృద్ధి దిశగా అడుగులు ● ఆధ్యాత్మికతలో వీరవల్లి, జంక్షన్ ప్రత్యేకం ● మల్లవల్లితో పారిశ్రామికంగా శిఖరాగ్రానికి ● వ్యవసాయంలోనూ వైవిధ్యమే

ఆంధ్రజ్యోతి, హనుమాన్‌జంక్షన్ రూరల్: పారిశ్రామికంగా మల్లవల్లి అభివృద్ధి చెందటం, ఆధ్యాత్మికంగా జంక్షన్ రూపాంతరం చెందటం, వినూత్న వ్యవసాయ సాగు పద్ధతులను అవలంబిస్తున్న గ్రామాలు.. విద్యా ప్రమాణాలను పెంచే సంస్థల ఏర్పాటు.. అన్నింటికీ మించి మాతృభూమిపై మమకారం చూపుతున్న దాతల సహకారంతో గన్నవరం నియోజకవర్గంలోని 'బాపులపాడు' మండలం సరికొత్తగా విస్తరిస్తోంది. అభివృద్ధే పథానంగా ముందుకు దూసుకుపోతోంది.

ఆధ్యాత్మికంగా వీరవల్లి, హనుమాన్ జంక్షన్

ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడా లేని విధంగా మానవ రూపంలో దాసాంజనేయ స్వామి హనుమాన్‌జంక్షన్‌లో కనిపిస్తారు. దేశం నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఇక్కడికి వస్తున్నారు. రిషికేశ్‌లో మాత్రమే ఉన్న శ్రీసీతారామ లక్ష్మణ సమేత దాసాంజనేయస్వామి విగ్రహం వీరవల్లిలోని ప్రాజెక్ట్ కామధేనులో మాత్రమే కనిపిస్తుంది. రైల్వేస్టేషన్ వద్ద 150 అడుగులతో భక్తాంజనేయస్వామి విగ్రహం మరో ప్రత్యేకత. పెరికీడులోని ఏలూరు కాలువ గట్టు దగ్గర పురాతన శివలింగంపై మూడునామాలు కలిగి ఉండటం, వీరవల్లిలోని పురాతన శ్రీగంగాపార్వతీ సమేత కొండేశ్వర స్వామి, పెరికీడులోని పంచాయతన క్షేత్రంగా భాసిల్లుతున్న శ్రీముక్తి కాంతా సమేత ముక్తేశ్వరస్వామి భక్తులు దర్శనమివ్వడం ఆధ్యాత్మికంగా ప్రత్యేకతలు కలిగినవి. భక్తులు పెద్దసంఖ్యలో వస్తుండటంతో బాపులపాడు ప్రత్యేకత సంతరించుకుంది.

పారిశ్రామిక శిఖరాగ్రాన మల్లవల్లి

మల్లవల్లిలో వేలాది ఎకరాల్లో ఏపీఐఐసీ ఏర్పాటు చేసిన మెగా ఫుడ్‌పార్క్‌లో ఆశోక్ లేలాండ్, పార్లే లాంటి దిగ్గజ సంస్థలతో పాటు చిన్నతరహా పారిశ్రామిక వేత్తలు పెద్దసంఖ్యలో పరిశ్రమలు స్థాపించి వేలాది యువతకు ఉపాధి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. బొమ్ములూరులో పుట్టగుంట సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లెదర్ ఫ్యాక్టరీ విదేశాలకు నాణ్యమైన ఉత్పత్తులు ఎగుమతి చేస్తూ అవార్డులు గెలుచుకోవడం ప్రత్యేకం. రేమల్లె, రంగన్నగూడెం, ఆరుగొలను గ్రామాల్లో ఏర్పాటు చేసి మోహన్ స్పింటెక్స్ ఇండియా లిమిటెడ్, ఎన్ఎస్ఎల్, ఆగ్రో ఇండస్ట్రీస్ ఫ్యాక్టరీలు పారిశ్రామికాభివృద్ధికి మచ్చుతునకలు.



విద్యాసంస్థలకు కేంద్రం

జవహర్ నవోదయ విద్యాలయం, అమ్మ నిలయం (ఆవాసీ విద్యాలయ) లాంటి కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలకు తోడు అనేక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు విద్యాభివృద్ధికి కృషి చేస్తూ బాపులపాడు మండల ప్రత్యేకతను నిలుపుతున్నాయి. చుట్టుపక్కల ఏడుకు పైగా ఇంజనీరింగ్ కళాశాలలు, రెండు వైద్య కళాశాలలకు తోడు ఐఐటీ లాంటి అత్యున్నత విద్యాలయాలు వస్తే బాగుంటుందని ప్రజల ఆశాభావం.

ఆదర్శవంతమైన వ్యవసాయం

ఆయిల్‌పామ్ తోటలు మొదలైందే బాపులపాడు మండలం. ఈ తోటలతో పాటు మామిడి, కొబ్బరి సాగు చేస్తూ రైతులు వాణిజ్యపంటలకు పెద్దపీట వేస్తున్నారు. అంతరపంటలుగా అరటి, కోకో, ములగ, మిరియం, తీగజాతి కూరగాయలు సాగు చేస్తూ ప్రత్యేకత చాటుతున్నారు. రేమల్లెలో డ్రాగన్ ఫ్రూట్‌తో పాటు సీతాఫలం సాగు చేస్తుంటే, మడిచర్లలో ఖర్జూరసాగు చేస్తూ రాష్ట్రానికే దిక్సూచిగా మారారు.

సహకార రంగంలోనూ ప్రత్యేకమే..

సహకారరంగంలో స్థాపించిన హనుమాన్ షుగర్స్ మెట్టప్రాంత రైతులకు అండగా నిలబడితే అది కనుమరుగైన తర్వాత కృష్ణా మిల్క్ యూనియన్ పాడిరైతులకు అండగా నిలబడింది. వీరవల్లిలో కోట్లాది రూపాయల వ్యయంతో తక్కువ సమయంలో నిర్మించి అత్యాధునిక సాంకేతికతతో నాణ్యమైన పాల ఉత్పత్తులకు బ్రాండ్‌గా ప్రపంచవ్యాప్త గుర్తింపు సాధించడంతో పాటు సహకార రంగంలో రాష్ట్రంలోనే ప్రథమంగా స్వచ్ఛత అవార్డు సాధించిన ఘనత ప్రాజెక్ట్ కామధేనుకే సొంతం.

దాతల సహకారం

రంగన్నగూడెంలో ఆర్ఆర్‌డీఎస్ (రంగన్నగూడెం రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ) పేరుతో, వేలేరు, వీరవల్లి గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీ పేరుతో విదేశాలతో పాటు వివిధ ప్రాంతాల్లోని ప్రవాసాంధ్రులకు తోడు గ్రామంలోని పెద్దలు స్వగ్రామాభివృద్ధికి స్థలాలు, నగదు రూపంలో సహకారం అందించడం అభినందనీయం.

ప్రత్యేక విద్యార్థులకు ఉచిత ఉపకరణాలు

సమగ్ర శిక్ష ఏపీసీ రజనీకుమారి

కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు 5 ప్రాంతాల్లో ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరాలు నిర్వహించనున్నట్టు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎం రజనీకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18ఏళ్లలోపు ఉండి, సదరం సర్టిఫికెట్ ఉన్న, పాఠశాలలో నమోదైన విద్యార్థులు అర్హులన్నారు. వివరాలకు తమ మండల భవిత కేంద్రాల్లోని ఐఈఆర్‌పీలను సంప్రదించవచ్చన్నారు. అర్బన్‌కు సంబంధించి ఈనెల 18న ఎంకే బేగ్ హైస్కూల్‌లో శిబిరాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. 19న మైలవరం లక్కిరెడ్డి హనిమిరెడ్డి హైస్కూల్లో, ఈనెల 20న కంభంపాడు జెడ్‌పీహెచ్ఎస్‌లో శిబిరాలుంటాయన్నారు. 21న నందిగామ జెడ్‌పీహెచ్ఎస్, నవంబరు 22న జగ్గయ్యపేట నియోజకవర్గంలోని చిల్లకల్లు జెడ్‌పీహెచ్‌లో శిబిరాలు అందుబాటులో ఉంటాయన్నారు.

'వందేమాతరం' చిత్ర ప్రదర్శన అద్భుతం: ఎన్టీఆర్ కలెక్టర్

కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన చిత్రరూప ప్రదర్శన అద్భుతంగా వుందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వందేమాతరం చిత్ర రూప ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సమరానికి స్ఫూర్తినిచ్చిన వందేమాతర గేయాన్ని చిత్రరూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. భారతజాతికి స్వాతంత్ర్య నినాదమైన 'వందే



మాతరం' సారాంశాన్ని చిత్రరూపం ద్వారా యువతకు సులభంగా తెలియజేయవచ్చన్నారు. వందేమాతరంలోని భావం మన సంస్కృతిని ప్రతిబింబిస్తుందని, నిత్యస్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. సృజనాత్మకతతో చిత్రాలను రూపొందించిన భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జున రావును కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమాధికారి యు.శ్రీనివాసరావు, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం ఎంతో కీలకం

● ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్ రాధికారెడ్డి

● పిన్నమనేనిలో ఛాయా మానసిక ఆరోగ్య క్లబ్ ఏర్పాటు



గన్నవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మనిషి సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే దేన్నయినా సాధించగలుగుతారని ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్ కే రాధికా రెడ్డి అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల సైకాలజికల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హనుమార గ్యాలరీలో అండ ర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఛాయా-మానసిక ఆరోగ్య క్లబ్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యమంటే కేవలం శారీరక ఆరోగ్యమే కాదని, మానసిక ఆరోగ్యం కూడా అవసరమన్నారు. సమయానికి, ఆరోగ్యానికి, బంధాలకు విలువ కట్టలేమన్నారు. కళాశాలలో మానసిక ఆరోగ్య క్లబ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మానసిక సమస్యలపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థుల పైన ఉందన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీవీ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ శ్రీకాంత్, డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

రూ.15వేల పింఛన్‌లకు అర్హులైనవారు సర్టిఫికెట్లు పొందండి



ప్రభుత్వాసుపత్రి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పెరాలసిస్, మస్క్యులర్ డిస్ట్రోఫీ, మంచానికే పరిమితమైన, తలసేమియా, సికెల్ సెల్ అనీమియా, తీవ్రమైన హిమోఫీలియా, బైలెటరల్ ఎలిఫెంటియాసిస్, కిడ్నీ వ్యాధిగ్రస్థులు, మల్టీ డిఫార్మెంటీ లెప్రసీ, లివర్, గుండె మార్పిడి వ్యాధిగ్రస్థులకు ప్రభుత్వం మంజూరు చేసే రూ.15 వేల పింఛన్ కోసం ప్రభుత్వాసుపత్రిలో ప్రతి మంగళవారం సర్టిఫికెట్లు పొందాలని ఆసుపత్రి సూపరిటెండెంట్ ఏ వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైనవారు ఆసుపత్రికి వచ్చి స్పెషలిస్ట్ డాక్టర్‌తో పరీక్షలు చేయించుకుని సర్టిఫికెట్ తీసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ అదాలత్

మచిలీపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి మచిలీపట్నం పోతేపల్లి ఇమిటేషన్ జ్యూయలరీ పార్కులోని అసోషియేషన్ హాల్‌లో మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు మచిలీపట్నం విద్యుత్‌శాఖ ఈఈ జీ గోవిందరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. కన్స్యూమర్ రెడ్రెసెల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) విజయవాడ ఆధ్వర్యంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎం ఇమ్మానుయేలు, విద్యుత్‌శాఖ ఎస్ఈ, ఇతర అధికారులు పాల్గొంటారన్నారు. సమస్యలు చెప్పేవారు, వారి విద్యుత్ కనెక్షన్ నెంబరు, ఎదురవుతున్న ఇబ్బందులు, వినియోగదారుల చిరునామా, సెల్‌ఫోన్ నెంబర్లతో పూర్తి వివరాలు తెలియజేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో హైవోల్టేజీ, లోవోల్టేజీ, ఇతరత్రా సమస్యలను తెలియజేస్తే నమోదు చేసుకుని పరిష్కరించడం జరుగుతుందన్నారు.

హ్యూమన్ రైట్స్ డ్రగ్ అండ్ క్రైమ్ ప్రివెన్షన్ సెల్

జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



పెనమలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా బంటుమిల్లికి చెందిన నంగెడ్డ నాగేశ్వరరావు హ్యూమన్‌రైట్స్‌కి చెందిన డ్రగ్స్ అండ్ క్రైమ్ ప్రివెన్షన్ సెల్ విభాగానికి కృష్ణాజిల్లా చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కృష్ణాజిల్లాలో డ్రగ్స్ అండ్ క్రైమ్ యాక్టివిటీలను తగ్గించడానికి, మానవ హక్కుల పరిరక్షణకు కృషిచేస్తానన్నారు.

సకాలంలో అర్జీలు పరిష్కరించాలి

● కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ అర్జీలపై శ్రద్ధపెట్టి సకాలంలో పరిష్కరించేందుకు కృషిచేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ఆయన కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశపు మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, డీఆర్‌వో కే చంద్రశేఖరరావు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవితో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచీ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీకోసంలో ప్రజలు సమర్పించే అర్జీలను పరిష్కరించే విధానం, వాటిని ఆన్‌లైన్‌లో సమర్పించే ప్రక్రియపై అధికారులకు ఎన్నోసార్లు అవగాహన కల్పించినా అవే తప్పులు పునరావృతం కావటంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అవగాహన లేక చేసే తప్పులతో అర్జీలు రీ ఓపెన్ అవుతున్నాయనీ, అర్జీ ఎండార్స్‌మెంట్ చేసే విధానంపై అధికారులు కిందిస్థాయి అధికారులకు తప్పనిసరిగా అవగాహన కల్పించాలని సూచించారు. అర్జీదారు లబ్ధిపొందితే తప్పు సిటిజెన్ బెనిఫిటెడ్ ఆప్షన్ ఎంచుకోవద్దని, సమస్య ప్రభుత్వ పరిధిలో ఉంటే అదే అంశాన్ని అక్కడ తెలపాలని సూచించారు. వచ్చే సారి పునరావృతమైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఆర్‌వో మాట్లాడుతూ, ఐ గాట్ కర్మయోగి ఆన్‌లైన్ కోర్సులను పూర్తిచేయటంలో చాలా శాఖలు వెనుకబడి ఉన్నాయనీ, త్వరగా పూర్తిచేయించేలా సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు.



కలెక్టరేట్‌కు వచ్చిన పెదపాలెం మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, చిత్రంలో జేసీ నవీన్, డీఆర్‌వో చంద్రశేఖరరావు

సమస్యలు

2006లో నాగాయలంక మండలం పెదపాలెం గ్రామంలో అప్పటి ప్రభుత్వం రెండు సెంట్లు చొప్పున పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేశారనీ, ఇప్పటివరకూ స్థలాలు చూపించలేదనీ, భూమి చూపిస్తే ఇళ్లు కట్టుకుంటామని గ్రామానికి చెందిన దాదాపు 20 మంది మహిళలు కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. కలెక్టర్ సంబంధిత తహసీల్దార్‌తో ఫోన్లో మాట్లాడి మంజూరుచేసిన భూమిలో జంగిల్ క్లియరెన్స్ చేయించి త్వరలో ఇళ్లస్థలాలు ఇస్తామని భరోసా ఇచ్చారు. నివాసముంటున్న ఇంటిని ఇద్దరు కుమారులు తమ పేరున రిజిస్ట్రేషన్ చేయించుకుని తమను ఇంటి నుంచి గెంటివేశారని, తమ బాగోగులు పట్టించుకోకుండా శారీరకంగా చిత్రహింసలకు గురిచేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వృద్ధులైన భార్యాభర్తలు తమగోడును వెళ్లబోసుకున్నారు. సదరు రిజిస్ట్రేషన్ రద్దుచేయించి తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని ఉయ్యూరు మండలం కాటూరు గ్రామానికి చెందిన ఇందిరాసి సూరిబాబు, రామలక్ష్మి అర్జీ సమర్పించారు. కళాశాల చదువుకుంటున్న ముగ్గురు ఆడపిల్లలున్నారనీ, వారి చదువు కోసం బ్యాంకు ఖాతాలో దాచుకున్న నగదు పిల్లలకు అవగాహన లేక చేసిన పొరపాటుకు సైబర్ నేరగాళ్ల ద్వారా సుమారు రూ.94వేలు పోగొట్టుకున్నానని న్యాయంచేసి ఆదుకోవాలని పామర్రుకు చెందిన ఊసల అనిత అర్జీద్వారా కలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన కలెక్టర్ పీ-4 ద్వారా పిల్లల చదువులకు అవసరమైన సహాయానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు నైపుణ్యాలు అవసరం

● సీబీసీ అధికారి రమేష్‌చంద్ర

కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారతీయ ఫార్మసీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, ఫార్మసీ విద్యార్థులు విద్యతో పాటు సాఫ్ట్ స్కిల్స్, పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను అభ్యసించాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ రమేష్‌చంద్ర పిలుపునిచ్చారు. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ (ఐపీఏ), ఐపీఏ-ఎస్ఎఫ్ సంయుక్తంగా ఈ ఏడాది 'వ్యాక్సిన్‌లకు మద్దతుదారులుగా ఫార్మసిస్టులు' ఇతివృత్తంపై విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ ఫర్ విమెన్, ఎనికేపాడులో నిర్వహించిన 64వ నేషనల్ ఫార్మసీ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. మరో నాలుగేళ్లలో 100 బిలియన్ డాక్టర్ విలువకు చేరనున్నదని అంచనా వేస్తున్న, భారతీయ ఫార్మా పరిశ్రమకు అవసరమైన ఫార్మాస్యూటికల్ సైన్సెస్, అనలిటికల్, రిసెర్చ్ & డేటా స్కిల్స్, క్వాలిటీ కంట్రోల్, క్లినికల్, పేషెంట్-కేంద్రిత నైపుణ్యాలు, బిజినెస్, మార్కెటింగ్ వంటి అంశాలలో నైపుణ్యం పెంచుకొని విద్యార్థులు సర్టిఫికేషన్ పొందాలని సూచించారు. సమావేశంలో ప్రపంచ ప్రీమెచ్యూరిటీ దినం సందర్భంగా మాట్లాడుతూ వైద్య విధానంలో పురోగతితో సమయానికి ముందే పుట్టిన శిశువులు బంగారు భవిష్యత్తును పొందుతున్నారని రైన్‌బో చిల్డ్రన్స్ హాస్పటల్, విజయవాడ కన్సల్టెంట్ ఓబీజీ & గైనిక్, లాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ స్నేహ మద్దుకూరి తెలిపారు. నేషనల్ ఫార్మసీ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులు సమీప గ్రామాల సందర్శన చేసి వివిధ టీకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నిపుణుల ప్రసంగాలు, పునశ్చరణ పోటీలనూ నిర్వహించారు. తొలుత విద్యార్థులు, అధ్యాపకులు ఎనికేపాడు గ్రామంలో టీకాలపై అవగాహన ర్యాలీని నిర్వహించారు.




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రమేష్‌చంద్ర

ఆపరేషన్.. శునక..!

విజయవాడలో వీధి కుక్కలపై ప్రత్యేక దృష్టి ● యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌లో చురుగ్గా జనన నియంత్రణ ఆపరేషన్లు ● వీధి కుక్కల సంఖ్య పెరగకుండా ప్రత్యేక చర్యలు ● ప్రత్యేక వాహనంలో ఏబీసీ సెంటర్‌కు కుక్కల తరలింపు

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: నగరంలో వీధి కుక్కల సంఖ్య పెరగకుండా విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) పటిష్ఠ చర్యలు తీసుకుంటోంది. శివారులోని సింగ్‌నగర్ ఎక్స్‌ఎల్ ప్లాంట్ దగ్గర ఏర్పాటు చేసిన యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రంలో వీధి కుక్కలకు ఆపరేషన్లు చురుగ్గా సాగుతున్నాయి. ఆపరేషన్ అనంతరం నీరసించిన కుక్కల విశ్రాంతికి ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ సంరక్షణ కేంద్రంలో ఆపరేషన్, టీకాల నిర్వహణ జరుగుతోందని వైద్యులు వెల్లడించారు. వీధి కుక్కల దాడుల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానికంగా ఏబీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



నగరంలో సుమారు 30వేలకు పైగా వీధి కుక్కలున్నాయి. ఇవి అన్ని ప్రాంతాల్లోనూ విస్తరించాయి. ప్రధానంగా స్లమ్ ఏరియాల్లో ఎక్కువ. ఇవి వీధుల్లో సంచరిస్తూ చిన్నారులపై దాడులకు తెగబడుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల పరిసరాల్లో సంచరించే కుక్కలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

రాత్రి సమయాల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ వాహన చోదకులపై విరుచుకుపడుతున్న కుక్కలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



రోజూ 50 నుంచి 60 కుక్కలకు ఆపరేషన్, టీకాలు



రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ఆదేశాలతో కుక్కల జనన నియంత్రణ ఆపరేషన్లు చురుగ్గా సాగుతున్నాయి. వాస్తవానికి జనన నియంత్రణ ఆపరేషన్లు గతంలోనే జరిగేవి. అయితే యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఆదేశాలు ఈ ఆపరేషన్‌లకు కొంత బ్రేక్ వేశాయి. ఇటీవలే అదే యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఆపరేషన్‌లకు మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో వీఎంసీ వెంటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లు ఆపరేషన్లు ప్రారంభించారు. నగరంలో ప్రస్తుతం 25 మంది డాగ్ క్యాచర్స్ ఉన్నారు. వీరు వీధుల్లోని కుక్కలను పట్టుకొచ్చేందుకు గతంలో రెండు వాహనాలుండేవి. కుక్కల సంఖ్య పెరగడంతో మరో మూడు కొత్తవి తీసుకొచ్చారు. వీధి కుక్కలను పట్టుకురావడం, వాటిని ఏబీసీ కేంద్రంలో సంరక్షించడం, ఆపరేషన్లు చేయడం, కొన్నాళ్లు అక్కడే జాగ్రత్తగా చూసుకోవడం, ఆహారం పెట్టడం, ఇతర టీకాలు వేసే పనుల కాంట్రాక్ట్‌ను హైదరాబాద్‌కు చెందిన నవోదయ వెట్ సెక్యూరిటీ తీసుకుంది. ప్రస్తుతం ఈకేంద్రంలో రోజూ 50 నుంచి 60 కుక్కలకు జనన నియంత్రణ ఆపరేషన్లు జరుగుతున్నట్లు వైద్యులు చెప్పారు. యాంటీ ర్యాబీస్ టీకాలు, డీ వార్మింగ్ ఇంజెక్షన్లు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. ఆపరేషన్ పూర్తయిన కుక్కల విశ్రాంతికి ప్రత్యేక 320 గదులున్నాయి. ఒక వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, ఐదురుగు డాక్టర్లు, ఇద్దరు కాంపౌండర్లు విధులు నిర్వర్తిస్తున్నారు.

ఆదరించేవారికి అప్పగిస్తూ..



నగరంలో జంతు ప్రేమికులకు కొదవ లేదు. వీధి కుక్కలను సైతం ఆదరించే వారెందరో ఉన్నారు. డాగ్ క్యాచర్స్ కుక్కలను పట్టుకుని వెళితే ఆయా వీధుల్లో కుక్కలను పోషించే వారు తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు. అలాంటి వారందరూ నగరంలోని ఏబీసీ కేం ద్రానికి చేరుకుంటున్నారు. అప్పటికే గదుల్లో బందీలుగా ఉండి మానసికంగా కుంగిపోయిన కుక్కలు వారిని చూడగానే ఎంతో ఉత్సాహం తో ముందుకు కదులుతున్నాయి. ఆపరేషన్లు పూర్తయ్యాక అలాంటి శునకాలను నిబంధనల మేరకు వారికి అప్పగిస్తున్నట్టు తెలుస్తోంది.



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 640

వైభవంగా శ్రీనివాస కల్యాణం

గుడ్లవల్లేరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : డోకిపర్రు భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా శ్రీనివాస కల్యాణం సోమవారం నిర్వహించారు. గోవింద నామస్మరణల నడుమ, వేదపండితుల మంత్రోచ్ఛరణలతో భక్తకోటిని ఆహ్లాదపరిచే ఆధ్యాత్మిక మహోత్సవం శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పి.వి. కృష్ణారెడ్డి, సుధారెడ్డిల పర్యవేక్షణలో నిర్వాహకులు బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ, పి.ప్రసన, వేంకటేశ్వరరెడ్డిలు పాల్గొని కల్యాణ మహోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కళ్యాణాన్ని తిలకించి స్వామిని దర్శించుకొన్నారు.



శ్రీనివాసుని కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

• ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, నవంబరు17(ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హామి ఇచ్చారు. సోమవారం స్థానిక ప్రజావేదికలో ప్రజల నుంచి వలు సమస్యలతో వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రధమ ప్రాధాన్యతనిస్తుందన్నారు. కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, నాయకులు వాసే మురళీ, సన్యాసిరావు, వేణుబాబు పాల్గొన్నారు.

గుడివాడ : ఐ లవ్ గుడివాడలో భాగంగా పట్టణ సుందరీకరణ చేపట్టనున్నామని, పట్టణాభివృద్ధికి రూ.9కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. సోమవారం స్థానిక ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో ఆర్‌డీవో, మున్సిపల్ కమిషనర్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి సమగ్ర అభివృద్ధికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని, ప్రాధాన్యత ప్రకారం ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. డిసెంబరు నెలలో జరిగే ఏఎన్ఆర్ కళాశాల వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొనే మంత్రిలోకేష్ దృష్టికి సమస్యలను తీసుకువెళ్తానని, పట్టణంలో గుర్తించిన ప్రాంతాల్లో సుందరీకరణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. సీఆర్‌డీఏ నిధులతో ఇప్పటికే పలు ప్రాంతాల్లో రూ.3కోట్ల నిధులతో అభివృద్ధి పనులను ప్రారంభినట్లు తెలిపారు. సమీక్షా సమావేశంలో ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, మున్సిపల్ ఇంజినీర్ ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ

నందివాడ: కుష్టు వ్యాధి ఇంటింట సర్వే కార్యక్రమంలో భాగంగా రామాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు మంజూష, సింధూష ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించినట్టు డాక్టర్ మంజూష తెలిపారు. ఈ కుష్టు వ్యాధి కార్యక్రమాలు ఈ నెల 17వ తేదీ నుంచి ఈ నెల 30వ తేదీ వరకు ఇంటింటసర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శివాలయాల్లో కార్తీక సందడి

• భక్తులతో పోటెత్తిన శివాలయాలు



గుడివాడలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

గుడివాడ, నవంబరు17(ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీక మాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని భీమేశ్వరస్వామి దేవస్థానం, గౌరీశంకర స్వామి దేవస్థానాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. స్వామికి విశేషపూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపపూజలు నిర్వహించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయాల్లో కార్తీకమాసోత్సవాలకు విచ్చేస్తున్న భక్తులకు ఎటువంటి సౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు పేర్కొన్నారు.



సకలేశ్వరస్వామి దేవస్థానం వద్ద కోటి దీపోత్సవం

నందివాడ: కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా కుదరవల్లి, పెదవిరివాడ, తమిరిశ, జనార్దనపురం, పోలుకొండ శివాలయాల్లో తెల్లవారుజాము నుంచి శివదర్శనం కోసం భక్తులు పోటెత్తారు. శివలింగానికి అభిషేకాలు, 365 వత్తులు వెలిగించటంతో శివాలయాలు శివనామస్మరణతో హోరెత్తాయి. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, ఛైర్మన్లు గొట్టుముక్కల బోసురాజు, మాజీ గుడివాడ మార్కెట్ అధ్యక్షులు ఆరికెపూడి రామశాస్త్రి దంపతులు, మండల డీసీ ఛైర్మన్ బి.ఏసుబాబు, మండల మాజీ ఉపాధ్యక్షులు దొరబాబు, గ్రామస్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : కార్తీక మాసం సందర్భంగా ఆదివారం రాత్రి రొయ్యూరు సకలేశ్వరస్వామి దేవస్థానం వద్ద గ్రామస్థులు కోటి దీపోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. ఆలయంలోను, ప్రక్కన రహదారులపైన వేలాది మంది భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు.



నందివాడలో పూజలు చేస్తున్న భక్తులు

తోట్లవల్లూరు వేణుగోపాలస్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి సహస్ర దీపాలంకరణ చేశారు. త్రిశూలం, శివలింగం, శంకు, , స్వస్తిక్ ఆకారంలో దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రొయ్యూరు కోటి దీపోత్సవంలో భక్తుల కోలాహలం

ఎంఈవో-1 రజనీకి మాతృవియోగం



ఎస్తేరు రాణి

గుడివాడ రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుడివాడ మండల విద్యాశాఖాధికారిణి -1 రజని మాతృమూర్తి తాతిపూడి ఎస్తేరు రాణి (74) సోమవారం ఉదయం ఆమె స్వగృహంలో మరణించారు. ఎస్తేరు రాణి వైద్య ఆరోగ్యశాఖలో పని చేసి పదవీ విరమణ చేశారు. ఈమెకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఎస్తేరు రాణి మరణ వార్త తెలుసుకుని ఉపాధ్యాయులు, యూనియన్ నాయకులు తదితరులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎంపీడీవో బివై.విష్ణుప్రసాద్, ఎంపీపీ గద్దె పుష్పరాణి తదితరులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించి ఎంఈవో -1 రజనికి ధైర్యం చెప్పి సానుభూతిని తెలియజేశారు.

ఘనంగా కార్తీక వనసమారాధన

గుడివాడ : గౌడ సామాజికవర్గం ఆర్థికంగా, విద్యాపరంగా, రాజకీయంగా ఎదగాలని, చైతన్యవంతులై ఆర్థిక స్వాలంబన దిశగా అడుగులు వేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గూడవల్లి కృష్ణార్జునరావు ఆకాంక్షించారు. ఆదివారం స్థానిక బేతవోలులో గౌడ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. తొలుత ఉసిరిచెట్టుకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పామర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వెంకటప్రసాద్, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి బెల్లంకొండ లక్ష్మణ్, రాష్ట్ర పెరికె కుల సమన్వయకర్త బత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల కష్టం తెలిసిన నాయకుడు సీఎం చంద్రబాబు

• ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, నవంబరు17(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పేదల కష్టం తెలిసిన నాయకుడు సీఎం చంద్రబాబు అని, బాధల్లో ఉన్న ప్రజలకు సహాయం అందించడంలో ఆయన ఎల్లప్పుడూ ముందుంటారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం స్థానిక ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో నియోజకవర్గ పరిధిలో 21మంది బాధితులకు మంజూరైన రూ.11లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ శ్రీకాంత్, మజ్జాడ నాగరాజు పాల్గొన్నారు.

కూచిపూడి: వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి పథకం ద్వారా పేదలకు అందుతున్న ఆర్థిక సహాయం గొప్ప ఆసరాగా నిలుస్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పాలంకిపాడుకు చెందిన అంగలకుదురు రజనీకి వైద్యఖర్చుల నిమిత్తం రూ.22 వేల చెక్కును బాధితురాలి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

చెరకు రైతుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా

• ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

తోట్లవల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చెరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని, గిట్టుబాటు ధర కోసం తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా స్పష్టం చేశారు. మండలంలోని చాగంటిపాడు శివారు పిల్లివానిలంకలో సోమవారం చెరకు రైతుల వద్దకు వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చెరకు పంటకు గిట్టుబాటు ధర లేదని, నరుకుడు, పంట రవాణా ప్రధాన సమస్యలుగా ఉన్నాయని రైతులు ఎమ్మెల్యేకు వివరించారు. వరదలతో పంట దిగుబడి సైతం తగ్గుతుందన్నారు. టన్నుకు సబ్సీడీతో కలిపి రూ. 3,690లుగా నిర్ణయించినట్టు చెపుతున్నారని రైతులు చెప్పారు. గిట్టుబాటు ధర కోసం, చెరకు సాగులో ఆధునిక యంత్రాలు సబ్సీడీపై ఇప్పించేందుకు ప్రభుత్వంతో మాట్లాడతానని రైతులకు హామీ ఇచ్చారు. చాగంటిపాడు పీఏసీఎస్ ఛైర్మన్ కళ్లం వంశీ కృష్ణారెడ్డి తదితరులున్నారు



చెరకు రైతులు, కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

కాలక్షేప మండప నిర్మాణ పనుల పరిశీలన

గుడ్లవల్లేరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) :వేమవరం కొండాలమ్మ అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో కాలక్షేప మండపం నిర్మాణ పనులను ఆలయ ఛైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహన్, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావులు సోమవారం పరిశీలించారు. రూ 90 లక్షల వ్యయంతో ఈ కాలక్షేప మండపాన్ని నిర్మిస్తున్నామని కొండలరావు తెలిపారు. కాగా దేవస్థాన నిధులు రూ.30 లక్షలకు సీజీఎఫ్ నిధులు రూ.60 లక్షల మ్యాచింగ్‌తో మండప నిర్మాణం చేస్తున్నామని ఆయన తెలిపారు. బేస్మెంట్ స్థాయికి వచ్చిన పనులను వారు పరిశీలించారు. మంగళవారం ఉదయం ఆలయంలో అమ్మవారికి భక్తులు మొక్కుతో సమర్పించిన తలనీలాలు పోగువేసుకొనే హక్కు వేలం పాట, భక్తులు అమ్మవారికి కానుకగా సమర్పించిన ధాన్యం విక్రయ బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నామని కొండలరావు ఈ సందర్భంగా తెలిపారు.



మండపం పనులను పరిశీలిస్తున్న ఛైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహన్

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

• పి.సుజాత

గుడ్లవల్లేరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తాము అభ్యసిస్తున్న విద్యను క్రమశిక్షణతో అభ్యసించాలనీ, పరిశోధనాత్మక దృష్టితో అధ్యయనం చేయాలని మచిలీపట్నం కృష్ణాయూనివర్శిటీ ఫార్మశీ విభాగ బీవోఎస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ పి.సుజాత అన్నారు. గుడ్లవల్లేరు వీవీఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సస్‌లో ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ గుడ్లవల్లేరు శాఖ ఆధ్వర్యంలో ఫార్మశీ వారోత్సవాలను సోమవారం ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, ఐపీఏ గుడ్లవల్లేరు శాఖ అధ్యక్షురాలు డాక్టర్ పి.రవీష లు సన్మానించారు. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ వారిచే ప్రకటించిన స్పెషల్ ఎచీవ్‌మెంట్ అవార్డు గుడ్లవల్లేరు శాఖకు వచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుజాత

బూత్ స్థాయి అధికారులకు శిక్షణ

పెదపారుపూడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా తహసీల్దార్ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో మండలంలో గల బూత్ స్థాయి అధికారులు అందరికీ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రస్తుత ఓటరు లిస్టులో ఉన్న ఓటర్లందరూ 2002 ఓటరు లిస్టులో ఉన్న ఓటర్లతో మ్యాప్ చేయుట , వారి ఫ్యామిలీ మెంబర్స్‌ను యాడ్ చేయుట (యాడ్ ప్రొజిని అనే ఆప్షన్ ఉపయోగించి కూతురు, కొడుకు, మనుమడు, మనుమరాలు) గురించి క్లుప్తంగా తహసీల్దార్, బూత్‌స్థాయి అధికారులు అందరికీ వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీ ఏసుపాదం, ఆర్ఐ శ్రీనివాసరావు, మండలంలోని బీఎల్‌వోలు పాల్గొన్నారు.

భర్త ఆత్మహత్య

గుడివాడ : మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీలో సోమవారం వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక టిడ్కో కాలనీకి చెందిన జాలాది నాగరాజు(34) హైదరాబాదులోని స్వీట్‌షాపులో పనిచేస్తున్నాడు. గత కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య వ్యక్తిగత వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. 16వ తేదీన సాయంత్రం ఫోన్‌లో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి బయలుదేరిన నాగరాజు సోమవారం తెల్లవారుజామున ఇంటికి చేరుకుని బెడ్ రూమ్ తలుపులు మూసుకుని, సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంతకి తలుపులు తెరవకపోవడంతో బంధువులు తలుపులు పగలకొట్టి చూడగా నాగరాజు ఫ్యాన్‌కు వేలాడుతున్నాడు. కిందకు దించి చూడగా అంబులెన్స్ టెక్నిషియన్ పరిశీలించిమృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గుడివాడ రూరల్ పోలీసులు తెలిపారు

ఆటో డ్రైవర్ ఆత్మత్యాయత్నం

పామర్రు : పామర్రులో ఆటో డ్రైవర్ భానుప్రకాష్ సోమవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భార్యతో ఏర్పడిన కలహాలు, పోలీసులు మందలించటం భానుప్రకాష్ ఆత్మహత్యాయత్నానికి కారణాలుగా తెలుస్తోంది. మద్యం సేవించి తనను హింసిస్తున్నాడని భర్తపై భార్య స్వాతి పోలీసులకు ఫిర్యాదు చేయగా భర్తను పోలీసులు పిలిచి మందలించటంతో సోమవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు సమాచారం. దీంతో భానుప్రకాష్‌ను కుటుంబ సభ్యులు పామర్రు నుంచి మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నట్టు తెలిసింది.

బీసీల అభివృద్ధే లక్ష్యం

గుడివాడ : గుడివాడ నియోజకవర్గంలో బలమైన నాయకత్వంలో నియోజకవర్గ కమిటీలను వేస్తానని భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన గుడివాడలో పర్యటించారు. స్థానిక నాగవరప్పాడు వద్ద యాదవ సంఘం ఆధ్వర్యంలో రామచంద్రయాదవ్‌కు ఘనస్వాగతం పలికారు. తొలుత కృష్ణ మందిరంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడలో బలమైన బీసీ నాయకత్వం సాధించేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో కమిటీలను ఏర్పాటు చేస్తానని రామచంద్రయాదవ్ ప్రకటించారు యాదవ సంఘం అధ్యక్షుడు డొక్కు రాంబాబు, లోయ రాజేష్ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

• ఎంపీడీవో సుహాసిని

కూచిపూడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ నెల 26వ తేదీ వరకు ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఎంపీడీవో సుహాసిని పేర్కొన్నారు. భట్లపెనుమర్రు జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. మారుమూల ప్రాంతాలకు సైతం ఆధార్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల్లో విద్యార్థులు తమ ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాల్సిందిగా సూచించారు. పంచాయతీ కార్యదర్శి వి.ప్రభుకుమార్, హెచ్ఎం భార్గవి, పాల్గొన్నారు.



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సుహాసిని



పడిపూజలో పాల్గొన్న భక్తులు

ఘనంగా వీరాంజనేయస్వామి పడిపూజ

గుడివాడ, నవంబరు17(ఆంధ్రజ్యోతి) : స్థానిక బంటుమిల్లి రోడ్డులో వేంచేసియున్న వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో వీరాంజనేయస్వామి పడిపూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాతలు నిమ్మగడ్డ నారాయణరావు దంపతులు, దేవస్థాన ప్రధాన అర్చకులు విజయభాస్కర్ నిర్వహణలో ప్రత్యేక పూజలు చేశారు. మండవల్లి గురుస్వాములు చంటిస్వామి, నాని స్వామి, హనుమాన్ భక్తబృందం సభ్యులు కూరాకుల నాగేశ్వరరావు, వీరబాబు, ఆంజనేయులు, సుబ్రహ్మణ్యం, తరుణ్, రాజేంద్ర వరప్రసాద్, రెడ్డి స్వామి, నగేష్ బాబు, శివ, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ కుసుమ కుమారి

తోట్లవల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు(నార్త్) రైతు సేవా కేంద్రంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ఎం కుసుమకుమారి ప్రారంభించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ తేమ 17శాతం ఉండే విధంగా ధాన్యాన్ని ఆరబెట్టి రైతు సేవా కేంద్రాలకు తేవాలని, గోనె సంచులు సైతం సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. వ్యవసాయాధికారిణి జి శ్రీదేవి, నార్తువల్లూరు పీఏసీఎస్ ఛైర్మన్ గుత్తా రాయకృష్ణ, ఏఈవో సునీల్, వీహెచ్‌ఏ ఛాముండేశ్వరి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరినీ ఆలోచింపచేసే శక్తి అక్షరానిదే..

• ఎంపీడీవో విమాదేవి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీను నాయక్

పెదపారుపూడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరినీ ఆలోచింపచేసే శక్తి అక్షరానికి ఉందని ఎంపీడీవో విమాదేవి పేర్కొన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెదపారుపూడి గ్రంథాలయంలో నాల్గవ రోజు కవి సమ్మేళనం నిర్వహించారు.డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ బి.శ్రీను నాయక్ ,యలమర్రు గ్రంథాలయ అధికారిణి జె.విజయలక్ష్మి,

గుడివాడ : స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 4వ రోజు సోమవారం లఘు నాటిక పోటీలను నిర్వహించారు. కొడాలి సోమసుందరరావు, కొల్లి శ్రీనివాసరావు, పట్టపు చిన్నా, చంద్రరావు, డీఆర్‌బీ ప్రసాద్, గ్రంథాలయ అధికారి ఎం.వి.డి.టి నగేష్ రవిచంద్‌పాల్గొన్నారు.

కూచిపూడి : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మొవ్వ శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థిని, విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతీ రోజు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు ముగింపు రోజున బహుమతులు అందిస్తున్నట్లు గ్రంథాలయ అధికారిణి కృష్ణకుమారి తెలిపారు.

పమిడిముక్కల: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని పమిడిముక్కల శాఖా గ్రంథాలయంలో ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వీల్‌ఛైర్స్, కప్పగంతుల ఆటల పోటీలు నిర్వహించారు. గుర్రాలంక పాఠశాల విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.గ్రంథాలయాల వల్ల ఉపయోగాలను గ్రంథాలయ అధికారి సాలర్ షరీఫ్ తెలియజేశారు.

పామర్రు: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సోమవారం పామర్రు ద్వితీయ శ్రేణి శాఖా గ్రంథాలయంలో మైక్రోసాఫ్ట్ సీనియర్ మేనేజర్ నందిపాటి హరీష్‌రెడ్డి విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇచ్చారు. కంప్యూటర్‌ను ఎలా వినియోగించాలి, ఎలాంటి లాభాలున్నాయి అనే అంశాలను విద్యార్థులకు ఆయన వివరించారు. అనంతరం 4, 5 తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి ఎరుకాస్సిరాణి పాల్గొన్నారు.



మొవ్వలో విద్యార్థులు పేపర్‌తో తయారు చేసిన బొమ్మలు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 640

వృద్ధుల యోగక్షేమాలపై న్యాయాధికారి అరుణ ఆరా



నాగాయలంక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ కోర్టు సివిల్ జడ్జి కె.అరుణ సోమవారం నాగాయలంకలోని వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. వృద్ధుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు పండ్లు ఇచ్చి, నిర్వాహకులకు బియ్యం బస్తా అందజేశారు. న్యాయవాది సనకా రఘురామ ప్రసాద్, ఎస్ఐ కె.రాజేష్, నిర్వాహకులు తలశిల లీలా మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు బండే శ్రీనివాసరావు

విశ్వనాథపల్లిలో సహకార వారోత్సవాలు

కోడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విశ్వనాథపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వద్ద 72వ అఖిల భారత సహకార ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షులు తోట సాంబశివరావు సహకార జెండాను ఆవిష్కరించారు. పీఏసీఎస్ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు ప్రారంభించారు. సీఈవో చుండూరు రమేష్, కైతేపల్లి పానకాలరావు, విశ్వనాథపల్లి వేణు, విష్ణుభొట్ల సూర్యనారాయణ, రైతులు, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేతో ప్రజల ఆస్తులకు రక్షణ

పెడన రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజల స్థిరాస్తులకు, హక్కులకు చట్టబద్ధత కల్పిస్తూ జరుతున్న స్వామిత్వ సర్వేను అందరూ అవగాహన చేసుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో నాగిరెడ్డి అన్నారు. కవిపురం గ్రామంలో స్వామిత్వ సర్వే జరగటంతో ప్రజలకు వారి ఆస్తి వివరాలను తెలిపే నోటీసులు , డ్రోన్ చిత్రీకరించిన వివరాలను ప్రజలకు అందజేశారు. దానిలో తప్పొప్పులు ఉంటే ఫిర్యాదు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ సర్వే వలన పూర్వార్జిత ఆస్తులకు సైతం హక్కు కలుగుతుందన్నారు. గ్రామంలో మొత్తం 160 నివాసాలు ఉన్నాయన్నారు. సర్పంచ్ పుప్పాల స్వరూపరాణి, సెక్రటరీ చాపరాల రాజేష్, ప్రజలు పాల్గొన్నారు.

అంగన్వాడీ, ఆరోగ్య కేంద్రాలకు నిధుల మంజూరు

పెడన రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరు అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణాలకు ముడా రూ.49 లక్షలు మంజూరు చేసిందని పీఆర్ఏఈ వై.ధర్మయ్య తెలిపారు. ఉరివిలో రూ.10 లక్షలు, బల్లిపర్రులో రూ.10 లక్షలు, కొంకేపూడిలో రూ.8 లక్షలు, ఈదుమూడిలో రూ.8 లక్షలు, మడకలో రూ.8 లక్షలు, చోడవరంలో రూ.5 లక్షలతో నిర్మాణాలు చేపట్టనున్నారన్నారు. టెండర్లు ప్రక్రియ పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభమౌతాయని తెలిపారు. కమలాపురం, కొంకేపూడి, చెన్నూరు, ఉరివి గ్రామాలలో ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణానికి ఒక్కో దానికి రూ.36 లక్షలు చొప్పున 1.08 కోట్లు విడుదల అయ్యాయన్నారు. ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణానికి టెండర్లు పిలిచామని వివరించారు.

రైతు నాగరాజు కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు

కోడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోడూరు మండలం విశ్వనాథపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పర పతి సంఘం సభ్యులు బత్తుల నాగరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు సోమవారం బాధిత కుటుంబానికి విశ్వనాథపల్లి సహకార సంఘం అధ్యక్షులు తోట సాంబశివరావు, మండల టీడీపీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు రూ.2 లక్షల బీమా పరిహారం చెక్కును అందజేశారు. పీఏసీఎస్ సీఈవో చుండూరు రమేష్, సభ్యులు కైతేపల్లి పానకాలరావు, విశ్వనాథపల్లి వేణు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉండాలి

నాగాయలంక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశం చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. రైతులు ఎదుర్కొంటున్న ముఖ్య సమస్యలపై పాలకవర్గం, అధికారుల మధ్య విస్తృత స్థాయిలో చర్చ జరిగింది. రైతులకు మరింత అండగా నిలవాల్సిన అవసరాన్ని కొల్లూరి తెలిపారు. కనీస మద్దతు ధర, రైతు బంధు పథకంపై రైతులకు అవగాహన కలిగించాలని నిర్ణయించారు. వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్తీక వనసమారాధన 20న

మోపిదేవి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ ఈనెల 20వ తేదీన మోపిదేవి వార్పు మామిడి తోటల్లో కార్తీక వనసమారాధన కార్యక్రమం జరుగుతుందని నియోజకవర్గ టీడీపీ నాయకులు బొబ్బా గోవర్ధన్, కొల్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం సాయంత్రం మోపిదేవి మండలం వార్పు గ్రామంలో వనసమారాధన నిర్వహించే తోటలను స్థానిక నేతలతో కలసి పరిశీలించారు.

అంబేడ్కర్ సేవలపై అవగాహన

గూడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం గూడూరు శాఖా గ్రంథాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సేవలను విద్యార్థులకు వివరించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఉప గ్రంథాలయ అధికారి బి.సిహెచ్.ఎన్.వి.వి. రమణ పాల్గొని అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాణంలో చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. ఆచార్యులు, జి. రాంబాబు, గ్రంథాలయ అధికారి నాగరవి, సిబ్బంది, పాఠకులు హాజరయ్యారు.

కుండలినీ యోగాశ్రమం సందర్శన

ఘంటసాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక వికాసం యోగాతోనే సాధ్యమని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు పేర్కొన్నారు. పాపవినాశనం శివసిద్ధి కుండలినీ యోగా ఆశ్రమాన్ని సురేష్‌బాబు గురువారం సందర్శించారు. సిద్ధయోగి నాగేశ్వర మహర్షి ఆధ్వర్యంలో ప్రచురించిన వేదాద్రి వాణి పుస్తకాలను సురేష్‌బాబుకు డాక్టర్ సుధామయి అందజేశారు.





గొడుగుపేట వేంకటేశ్వరస్వామి, ముత్యాలమ్మ ఆలయాల్లో కార్తీక దీపాలు



శివలింగార్చన చేస్తున్న ట్రస్టీ మేకా బంగారుబాబు దంపతులు, విద్యాసాగర్ గురూజీ



పులిగడ్డ ఆలయంలో పూజలు చేస్తున్న మండలి దంపతులు

చివరి సోమవారం పోటెత్తిన భక్తులు

• ఆలయాల్లో విశేషంగా కార్తీక దీపారాధనలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో దేవాలయాల్లో భక్తులు దీపారాధనలు చేశారు. గొడుగుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి ఆకారాన్ని చిత్రీకరించి దీపారాధనలు చేశారు. ఇంగ్లీషుపాలెం ముత్యాలమ్మ తల్లి దేవాలయంలో శివలింగాకారం, ఓంకారం, స్వస్తిక్ రూపాల్లో దీపారాధనలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సూర్యబలిజలు వినియోగించుకోవాలని టీడీపీ కార్పొరేటర్, సూర్యబలిజ రాష్ట్ర కన్వీనర్ చిత్తజల్లు నాగరాము అన్నారు. కార్తీక వనసమారాధన కార్యక్రమంలో చిత్తజల్లు నాగరాము మాట్లాడారు. సీఎం చంద్రబాబు బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచారని, ఇందుకు అనుగుణంగా బీసీలకు రానున్న మునిసిపల్, పంచాయతీ ఎన్నికల్లో అధికశాతం రిజర్వేషన్లు పొందే అవకాశం ఏర్పడిందన్నారు.





నాగాయలంక పుష్కరఘాట్ వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు, పెడనలో బారులుతీరిన భక్తులు

పెడన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో.

పెడన : గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. స్వామి దర్శనం కోసం ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. ఈవో జి.వి. కృష్ణారావు, అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ళ ప్రసాద్ పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. గూడూరు అగస్త్యయ్య, శివదత్త ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. అయ్యప్పలు ఆలయంలో ఈరుముడులు కట్టించుకున్నారు.

పార్థివేశ్వర శివలింగార్చన

చల్లపల్లి : కార్తీకమాసం సందర్భంగా పాగోలులోని కైవల్యాశ్రమ మందిరంలో కైలాస యంత్ర ప్రస్తార సహస్ర పార్థివేశ్వర శివలింగార్చన వైభవంగా జరిగింది. విద్యాసాగర్ గురూజీ పర్యవేక్షణలో విజయవాడకు చెందిన పిరాట్ల సాయికుమార్ శర్మ, ఆనంద్ శాస్త్రోక్తంగా శివలింగార్చన జరిపించారు. మట్టితో తయారుచేసిన శివలింగాలను ప్రత్యేకపీఠంపై అమర్చి పూజలు జరిపారు. పాగోలు ఎంపీటీసీ సభ్యుడు, ట్రస్టీ మేకా సత్యనారాయణప్రసాద్ (బంగారుబాబు) దంపతులు, ట్రస్ట్ సభ్యులు చాపరాల గాంధీప్రసాద్ దంపతులతోపాటు పలువురు దంపతులు, భక్తులు శివలింగార్చనలో పాల్గొన్నారు. నడకుదురు శ్రీపృథ్వీశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. లక్ష్మీపురం దుర్గాపార్వతీసమేత సోమేశ్వరస్వామికి, చల్లపల్లిలోని అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వరస్వామిని భక్తులు దర్శించుకుని పూజలు చేశాయి.

పెదకళ్లేపల్లిలో..

మోపిదేవి : కార్తీక మాసం చివరి సోమవారం మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సకలేశ్వరస్వామి, పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి దేవాలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. దీపాలు వెలిగించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

పులిగడ్డలో పుష్పార్చన

అవనిగడ్డ రూరల్ : పులిగడ్డ అలివేలు మంగ, రాజ్యలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ - సాయి సుప్రియ దంపతులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం పూజల్లో పాల్గొన్నారు. పుష్పయాగాన్ని బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి, మండలి వెంకట్రామ్ దంపతులు ప్రారంభించారు. ఈవో యార్లగడ్డ శ్రీనివాస్ (వాసు) ఆధ్వర్యంలో పర్యవేక్షించగా, పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణంలో కిటకిటలాడింది.

ఉభయముక్తేశ్వరాలయంలో..

గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ (రాజా) వేకనూరు ఉభయ ముక్తేశ్వరస్వామిని, సంతాన వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప పడిపూజలో పాల్గొన్నారు. సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో కాశీ అన్నపూర్ణదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు తుంగల వీరవసంతరావు - ఇందిరాదేవి దంపతులు పర్యవేక్షించారు.



వైభవంగా సింధూరార్చన

అవనిగడ్డ : గీతామందిరంలో కార్తీక బహుళ త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం సింధూర కుంకుమార్చన, రుద్రాక్ష అర్చన జరిపారు. విశ్వహిందూ పరిషత్, సామాజిక సమరసతా వేదిక కన్వీనర్ శోభారాణి ఆధ్వర్యంలో లలితా పారాయణం, లింగాష్టకం పారాయణ చేశారు. అర్చక స్వామి దివి నరసింహమూర్తి ఆధ్వర్యంలో మంత్రపుష్పం, తీర్థ ప్రసాదాలు అందించారు. ధర్మకర్త శ్రీహరిబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆంజనేయస్వామి ఆలయంలో ధన్వంతరీ హోమం నిర్వహించగా, భక్తులు పాల్గొన్నారు. **నాగాయలంక** : నాగాయలంక రామపాదక్షేత్రం రామలింగేశ్వరస్వామిని పెద్దసంఖ్యలో దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పుష్కరఘాట్‌లో పుణ్యస్నానాలు చేసేందుకు పోటెత్తా రు. కుటుంబసభ్యులతో కార్తీక దీపాలను వెలిగించారు. దీపాలను డొప్పలలో పెట్టి నదిలోకి వదిలారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలా కృష్ణ ప్రసాద్ పర్యవేక్షించారు.

వ్యవసాయ యాంత్రీకరణకు ప్రోత్సాహం

• 80 శాతం సబ్సిడీపై మూడు గ్రూపులకు డ్రోన్ల పంపిణీ

చల్లపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతుకు మేలు చేసే వ్యవసాయ యాత్రీకరణకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మేకావారిపాలెం సొసైటీలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు డ్రోన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు డ్రోన్ టెక్నాలజీ ద్వారా రైతులకు మేల ుచేసేందుకు కృషిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో 80 శాతం రాయితీపై రైతుల గ్రూపులకు డ్రోన్లు అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.9.80 లక్షల విలువైన డ్రోన్లపై 80శాతం రాయితీ రూ.7.84 లక్షలు మినహాయించి సంఘం వాటా రూ.1.96 లక్షలకే అందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో సహకార ఉద్యమానికి మూలపురుషుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య అని చెప్పారు. మేకావారిపాలెం సొసైటీ 1946లో స్థాపించిన విషయం తెలుసుకున్న ఆయన చరిత్ర కలిగిన సంఘానికి ప్రాతినిధ్యం వహించటం గర్వకారణమన్నారు. గోపాల మిత్ర ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, సుబ్రహ్మణ్యేశ్వర గ్రూప్, విహాన్ గ్రూపు సభ్య రైతులకు డ్రోన్లను ఆయన పంపిణీ చేశారు. సొసైటీ బయట డ్రోన్ పనితీరు పరిశీలించారు. సొసైటీలో 72వ జాతీయ సహకార వారోత్సవాలను పురస్కరించుకుని సొసైటీ చైర్మన్ గుత్తికొండ వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉచిత మినుము విత్తనాల పంపిణీని ప్రారంభించారు. రైతునేస్తం పథకంలో కుంచె తులసి అనే రైతుకు రూ.8 లక్షల రుణం చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ తోట కనకదుర్గ, ఎంపీపీ కోట విజయరాధిక, సొసైటీ ఛైర్మన్ గుత్తికొండ వంశీకృష్ణ, ఏవో కె.మురళీకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు మాలెంపాటి శ్రీనివాసరావు, టీడీపీ నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, మేకా వెంకటేశ్వరరావు, సీఈవోలు కె.శ్రీనివాసరావు, తోట కృష్ణారావు, పర్సన్లు వక్కలడ్డ శివరామకృష్ణ, చిటికినేని శ్రీనివాసరావు, గోపాలమిత్ర ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఛైర్మన్ మాలెంపాటి రంగారావు తదితరులు పాల్గొన్నారు.




రైతులకు డ్రోన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



పేద విద్యార్థులకు వసతులు కల్పించాలి

● కేయు వీసీకి హసీంబేగ్ వినతి

మచిలీపట్నం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్న పేద బాలికలకు వసతి సౌకర్యం కల్పించాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కూన రాంజీని మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీంబేగ్ కోరారు. విశ్వవిద్యాలయంలో ఉపకులపతిని హసీంబేగ్, బ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పి.వి.ఫణికుమార్, మునిసిపల్ మాజీ చైర్మన్ బాబాప్రసాద్ కలసి విశ్వవిద్యాలయంలో విద్యార్థుల వసతిపై చర్చించారు. విశ్వవిద్యాలయానికి కూటమి ప్రభుత్వం తగిన సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఉపకులపతి కూన రాంజీ మాట్లాడుతూ, ఫైనలియర్‌లోకి అడుగుపెట్టిన విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.



క్షేత్ర పరిజ్ఞానం అవసరం

మచిలీపట్నం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పుస్తక జ్ఞానంతో పాటు క్షేత్రస్థాయిలో శిక్షణతో ప్రత్యక్ష అనుభవం అవసరమని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి ఎస్. సరళకుమారి అన్నారు. లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఒకేషనల్ విద్యార్థులు కేడీసీసీ బ్యాంకు, చిలకలపూడి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. సరళకుమారి మాట్లాడుతూ, ఒకేషనల్ విద్యార్థులకు తరగతి నాలుగు గోడల మధ్యలో కాకుండా కొన్ని రోజులు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ పి. లక్ష్మి, లంకిశెట్టి హరనాథబాబు, సాజిదా సుల్తానా, జ్యోతి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి కుటుంబాలతోనే ఆనందాలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కుటుంబాలు ఆనందానికి పునాదిరాళ్లని ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజులు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సాహితీమిత్రులు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో నేటి కుటుంబ వ్యవస్థ- యువత బాధ్యత అంశంపై పెద్దిరాజులు మాట్లాడారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడం మంచిది కాదన్నారు. సాహితీమిత్రులు అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఏఎస్పీ శాయన సుశీల్‌రావు, మాజీ ప్రభుత్వ న్యాయవాది అజ్మతున్నీసాబేగం, పెడన విజయానంద డిగ్రీ కళాశాల అధ్యాపకుడు వి.విద్యాధర్, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వేముల రవికుమార్, సాహితీమిత్రులు సంస్థ కార్యదర్శి మేడిశెట్టి యోగలింగేశ్వరరావు, డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ పాల్గొన్నారు.



ఘనంగా అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

కోడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాదాలవారిపాలెంలో అభయాంజనేయస్వామి ఆలయ నాల్గో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు, మండలి వెంకట్రామ్ - సాయి సుప్రియ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారి ప్రదర్శించిన నాట్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ కమిటీ పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

దర్శకుడు రాజాబాబుకు సత్కారం

మచిలీపట్నం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా సినీరంగానికి ఎందరో నటులను అందించిందని దర్శకుడు టి.రాజాబాబు అన్నారు. రంగస్థల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సాహితీమిత్రుల సంస్థ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ ఆధ్వర్యంలో రాజాబాబును సత్కరించారు. ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యుడు వై. పూర్ణచంద్రరావు, మచిలీపట్నం కళాకారుల సంక్షేమ సంఘం కార్యదర్శి పి. రాజేశ్వరరావు, పల్లపోతు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

బందరు ఆర్టీసీ బస్టాండ్‌లో మందుబాబు వీరంగం

మచిలీపట్నం, నవంబరు17(ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం బస్టాండ్‌లో మందుబాబు సోమవారం వీరం గం సృష్టించాడు. ప్రయాణికులపైన దౌర్జన్యానికి దిగాడు. నాన్‌స్టాప్ బస్సు కండక్టర్, డ్రైవర్‌లతో వాగ్వాదానికి దిగాడు. మచిలీపట్నం బస్టాండ్‌లో సెక్యూరిటీ విభాగం, పోలీసులు అందుబాటులో లేకపోవడంతో మందుబాబులు వీరంగం సృష్టిస్తున్నారని, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

దాళ్వా లేదంటూ ఇచ్చిన జీవో వెనక్కి తీసుకోవాలి

బంటుమిల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : దాళ్వా లేదంటూ ఇచ్చిన జీవోను వెనక్కి తీసుకోవాలని కోరుతూ వైసీపీ ఆధ్వర్యంలో పెందుర్రు వద్ద 216 జాతీయ రాహదారి వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల రైతులు దాళ్వా లేక ఇబ్బందులు పడుతున్నారని, తీర ప్రాంతం కావడంతో అపరాలు సరిగా పండటంలేదని, పంట భూమి చౌడుగా మారుతుందని అన్నారు. . రెండో పంటగా దాళ్వా సాగు చేయడం వల్ల భూమిలో ఉప్పు శాతం తగ్గుతుందన్నారు. రెండో పంటగా దాళ్వాలేదని అపరాలు సాగుచేయాలని ఇచ్చిన జీవోను వెంటనే రద్దు చేయాలని రైతులతో కలసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు. పెందుర్రు జాతీయ రహదారి నుంచిబంటుమిల్లి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి తహసీల్దార్ పూర్ణచంద్రరావుకు వినతి పత్రం అందజేశారు.